జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php
సంపుటి 15 సంచిక 349 విశాఖపట్నం | శనివారం 03 సెప్టెంబరు 2022 | 8 పేజీలు | వెల : 5.00

విజయవాడ నగరంలో
రాఘవయ్య పార్క్ వద్ద గల
మన ఆఫీస్ లో
స్నేహా గ్రూప్ సభులకు
సమావేశాలు
నిర్వహించుకునేందుకు
40 మంది వరకు
అవకాశం కల్పించబడును.
వివరాలకు సంప్రదించండి
9000621111, 9440137451
76600 27670, 9908991763

# టిడిపి పేరు చెబితేనే.. వైసిపి వెన్నులో వణుకు

## త్వరగా ఎన్నికలు వస్తే రాష్ట్రానికి పట్టిన పీడ వదిలిపోతుంది: చంద్రబాబు



అమరావతి, ప్రజాపాలన ప్రతినిధి: త్వరగా ఎన్నికలు వస్తే రాష్ట్రానికి పట్టిన పీడ వదిలిపోతుందని.. నెత్తిన ఉన్న కుంపటి ఎప్పుడు దించుకుందామా అని ప్రజలు ఎదురుచూస్తున్నారని టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. టిడిపి కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న పార్టీ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ " పోలీసులు లేకుండా వస్తే వైసిపినో.. టిడిపినో తేల్చుకుంటాం. టిడిపి పేరు చెబితేనే వైసిపి వెన్నులో వణుకు మొదలవుతోంది. న్యాయబద్ధంగా, రాజకీయంగా పోరాడి రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు 'క్విట్ జగన్' 'సేవ్ ఆంధ్రప్రదేశ్' నినాదాన్ని ముందుకు తీసుకెళ్లాలి. ముఠా రాజకీయాలు, ఫ్యాక్షనిజాన్ని అంతం చేసిన ఘనత టిడిపిదే. రాష్ట్రంలో వైసిపి నేతలకూ భద్రత లేదు. రాష్ట్రం కోసం అవసరాన్ని బట్టి సమయానుకూలంగా పొత్తులపై నిర్ణయం తీసుకుంటాము. ఇప్పటి వరకూ పొత్తుల గురించి మాట్లాడలేదు. రాష్ట్ర పునర్నిర్మాణానికే ప్రాధాన్యత. పార్టీ శ్రేణులు నిరంతరం ప్రజల్లోనే ఉంటూ వారికోసం పనిచేస్తూ నమ్మకం పెంచాలి." చంద్రబాబు అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ఇకపై ఏ ఎన్నిక జరిగినా టిడిపి పోటీ అనివార్యమని.. గెలుపే ధ్యేయంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అభ్యర్థులను చంద్రబాబు ప్రకటించారు. పశ్చిమ రాయలసీమకు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, తూర్పు రాయలసీమకు కంచర్ల శ్రీకాంత్‌లను ఖరారు చేసినట్లు తెలిపారు. విశాఖపట్నంకు త్వరలోనే అభ్యర్థిని ఖరారు చేస్తామన్నారు. ఇవాళ్టి నుంచి ప్రతి ఇన్‌ఛార్జ్ తమ నియోజకవర్గంలోనే ఉండాలని.. పరిశీలకులు నెలలో 8 రోజులు అక్కడే ఉండేలా చూసుకోవాలని సూచించారు. టిడిపిపై విష ప్రచారం చేసే కొన్ని మీడియా సంస్థల కుట్రలను తిప్పికొట్టాలంటే టిడిపి సోషల్ మీడియా విభాగం మరింత బలోపేతం కావాలన్నారు.

# ఆ ఘనత మన ప్రభుత్వానిదే: జగన్

## పులివెందుల నియోజకవర్గ అభివృద్ధిపై సీఎం సమీక్ష



వైఎస్సార్ జిల్లా,ప్రజాపాలన ప్రతినిధి: వైఎస్సార్ జిల్లాలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోరోజు పర్యటన కొనసాగుతోంది. ఇడుపులపాయలో పులివెందుల నియోజకవర్గ అభివృద్ధిపై సీఎం సమీక్ష చేపట్టారు. విడతల వారీగా సాయంత్రం వరకు పులివెందుల నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ఇతర అంశాల పై స్థానిక నాయకులు, అధికారులతో సీఎం సమీక్ష జరిపారు. చదవండి: 'ప్రతి అడుగులోనూ నాన్నే స్ఫూర్తి'.. సీఎం జగన్ భావోద్వేగ ట్వీట్ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ పంటల బీమా విషయంలో గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.3వేల కోట్లు పంటల బీమా అందించామన్నారు. ఆ ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదన్నారు. పులివెందుల ఏరియా డెవలప్‌మెంట్స్ ఏజెన్సీపై సీఎం సమీక్ష నిర్వహించారు. రైతులంతా ఈ-క్రాప్ తప్పనిసరిగా చేయాలన్నారు. ఆసుపత్రుల్లో వైద్యుల నియామకాలపై సీఎం మాట్లాడుతూ, వైద్య, ఆరోగ్యశాఖలోనే 40వేల ఉద్యోగాలను భర్తీ చేశామని చెప్పారు. చక్రాయపేట మండలంలో రూ.1200 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు.

# మహానేత వైఎస్సార్‌కు జగన్ ఘన నివాళి



వైఎస్సార్ జిల్లా,ప్రజాపాలన ప్రతినిధి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ జిల్లాలో రెండోరోజు పర్యటిస్తున్నారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద ఆయన నివాళులర్పించారు. సీఎంతో పాటు ఆయన కుటుంబసభ్యులు వైఎస్ విజయమ్మ, వైఎస్ భారతి, వైఎస్ షర్మిల వైఎస్సార్‌కు నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులతో కలిసి వైఎస్ జగన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.



## పోలవరానికి సుదీర్ఘ చరిత్ర ఉంది: జైరాం రమేష్

హైదరాబాద్: పోలవరానికి సుదీర్ఘ చరిత్ర ఉందని కేంద్ర మాజీమంత్రి జైరాం రమేష్ తెలిపారు. ఏపీ చరిత్రలో పోలవరం ప్రాజెక్టు మైలు రాయిగా నిలిచిపోతుందన్నారు. హోటల్ దస్‌పల్లాలో కాంగ్రెస్ నేత కేవీపీ రామచంద్రరావు రూపొందించిన.. 'జలయజ్ఞం-పోలవరం-ఒక సాహసి ప్రయాణం' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సభలో జూమ్ ద్వారా జైరాం రమేష్ ప్రసంగించారు. ఏపీ విభజన చట్టం ద్వారా జాతీయహోదా కల్పించాలని కోరామని, తాగు, సాగునీటికి పోలవరం ఎంతగానో ఉపయోగపడుతుందని జైరాం రమేష్ తెలిపారు. పోలవరంపై జవాబు చెప్పే పరిస్థితిలో ప్రభుత్వాలు లేవని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ తప్పుబట్టారు. పోలవరానికి నిధులు ఇవ్వాల్సిన బాధ్యత కేంద్రానిదేనని, విభజన హామీలో ఉందని గుర్తుచేశారు. బీజేపీకి ఇష్టం లేనట్లయితే పార్లమెంట్‌లో కొత్త యాక్ట్ తేవాలని అరుణ్‌కుమార్ పేర్కొన్నారు.

# 'ఉక్కు' పరిరక్షణకు ఐక్య పోరాటం

## విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ



ఉక్కునగరం (విశాఖపట్నం), ప్రజాపాలన ప్రతినిధి: స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకునేందుకు ఐక్య పోరాటాలతో ముందుకెళ్తామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 568వ రోజుకు చేరాయి. శుక్రవారం నాటి దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ ఎల్ఎంఎంఎ, ఎస్‌బిఎం విభాగాల కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, గంధం వెంకటరావు, వరసాల శ్రీనివాసరావు, మురళి రాజు, వై.మస్తానప్ప, పరంధామయ్య, సంపూర్ణం, దాసరి శ్రీను, ఎల్‌వి.రమణ, రాజు, రాజబాబు మాట్లాడారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలో కొనసాగించే వరకూ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఇప్పటికే అన్ని జిల్లాల్లో పోరాట కమిటీ తరపున అనేక కార్యక్రమాలు నిర్వహించామని, ప్రజా, కార్మిక, విద్యార్థి, యువజన సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నుంచి విశేష స్పందన లభించిందని అన్నారు. విశాఖ ఉక్కు... ఆంధ్రుల హక్కు అని, దీన్ని ప్రయివేటుపరం చేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. బిజెపి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయన్నారు. ప్లాంట్ పరిరక్షణ కోసం ఎలాంటి త్యాగాలకైనా కార్మికులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

# వరదలో కొట్టుకుపోయిన ప్రాజెక్టు గేటు..



## సముద్రం పాలైన 12వేల క్యుసెక్కుల నీరు

ప్రకాశం, ప్రజాపాలన ప్రతినిధి: అధికారుల పర్యవేక్షణలోపం, సరైన మరమ్మతులు లేకపోవడంతో గుండ్లకమ్మ ప్రాజెక్టు మూడవ గేటు విరిగిపోయింది. బుధవారం రాత్రే గేటు దిగువభాగం దెబ్బతినటంతో భారీస్థాయిలో నీరు వఅథాగా పోతోంది. దీర్ఘకాలంగా గేట్లు నిర్వహణ, మరమ్మతుల్లో జరుగుతున్న నిర్లక్ష్యంతో ఈ పరిస్థితి ఏర్పడినట్లు తెలుస్తుంది. దీంతో ప్రాజెక్టులో ఉన్న నీటిలో అర టీఎంసీ నీరు గురువారం మధ్యాహ్నానికే దిగువకు వెళ్లిపోయాయి. తక్షణం దెబ్బతిన్న గేటు మరమ్మతుల్లో యంత్రాంగం నిమగమయింది. కొట్టుకుపోయిన గుండ్లకమ్మ ప్రాజెక్టు గేటు నుంచి రెండో రోజు శుక్రవారం కూడా నీరు వఅథాగా పోతోంది. బుధవారం రాత్రి గుండ్లకమ్మ ప్రాజెక్టు మూడో గేటు కొట్టుకుపోయింది. స్టాప్ లాక్ ద్వారా నీటిని ఆపేందుకు ఇంజనీర్లు చేసిన ప్రయత్నం విఫలమైంది. దీంతో 13, 14, 15 గేట్లు ఎత్తి ప్రాజెక్టులో నీటి వత్తిడిని అధికారులు తగ్గిస్తున్నారు. ఇప్పటికే 12వేల క్యుసెక్కుల నీరు సముద్రం పాలైంది. కాగా ప్రాజెక్టులో నీటి మట్టం తగ్గడంతో రైతులు, మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

# ఏపీ మంత్రి విశ్వరూప్‌కు అస్వస్థత



అమరావతి,ప్రజాపాలన ప్రతినిధి: ఏపీ రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. అమలాపురంలో మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన అస్వస్థతకు గురయ్యారు. ఛాతీలో నొప్పి రావడంతో కిందపడిపోయారు. దీంతో ఆయనను అమలాపురంలోని కిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి స్థిరంగానే ఉందని వైద్యులు తెలిపారు.

# మంగళూరులో మోడీకి ఘన స్వాగతం..

## రోడ్‌షోకు లక్షలాదిగా తరలివచ్చిన జనం.. పలు అభివృద్ధి పనులకు శ్రీకారం



కర్ణాటక,ప్రజాపాలన ప్రతినిధి: ప్రధాని నరేంద్రమోడీకి కర్ణాటకలోని మంగళూరులో ఘన స్వాగతం లభించింది. పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించే నిమిత్తం అక్కడికి వెళ్లిన మోడీకి కన్నడీగులు సాదర స్వాగతం పలికారు. లక్షలాది మంది రోడ్డుకు ఇరువైపులా నిల్చొని చేతులు ఊపుతూ, హర్షధ్వానాలు చేస్తూ ప్రధానికి గ్రాండ్ వెల్‌కమ్ తెలిపారు. ఈనేపథ్యంలో మోడీ మంగళూరు టూర్‌కు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కాగా ఈ పర్యటనలో మోడీ వెంట కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గోహ్లెట్, ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై, కేంద్ర మంత్రులు శోభాకరంద్లాజే, ప్రహ్లాద్ జోషీ, కర్ణాటక బీజేపీ శాఖ అధ్యక్షుడు నళిన్ కుమార్ కటేల్, పలువురు మంత్రులు, తదితర బీజేపీ సీనియర్ నాయకులు ఉన్నారు. పలు అభివృద్ధి పనులకు శ్రీకారం.. మంగళూరులోని గోల్డ్ ఫించ్ సిటీ మైదానంలో జరిగిన బహిరంగ సభలో మోడీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ. 3,800 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. దీనికి గానూ ఇదే వేదికగా ప్రధాని నరేంద్ర మోడీకి కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై ధన్యవాదాలు తెలిపారు. 'కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని డబుల్ ఇంజన్ ప్రభుత్వం అని చాలామంది చెబుతున్నారు. అయితే దేశంలో గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి ఈ ప్రభుత్వంలోనే జరిగింది. అయితే కొందరు దీనిని చూసి ఓర్చుకోలేకపోతున్నారు. కారు కూతలు కూస్తున్నారు. కాగా ఈ కార్యక్రమంలోనే పలువురు మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్ కార్డులు పంపిణీ చేశారు.

ఫూలే - అంబేడ్కర్ రాజ్యాధికార సమితి (PARS)
అంశము :
బహుజన రాజకీయ సాధికారత
ఆశయాల సాధన - కమిటి నిర్మాణం కొరకు
తేదీ : 03.09.22 ( శనివారం) సమయం: ఉదయము.10.30 గంటలకు
వేదిక : ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనం, భీమవరం.
ముఖ్య అతిథి : డా. జె. బి. రాజు గారు IIS-VRS. నేషనల్ ప్రెసిడెంట్, (PARS)
గౌరవ అతిథి : DR.K. శివభాగ్యరావు గారు, IRS-vrs
PARS నేషనల్ కన్వీనర్, ఫౌండర్ & చైర్మన్ స్నేహ టీవీ, అంబేడ్కర్ టీవీ
ఆత్మీయ అతిథి : DR. గూడూరు సీతా మహాలక్ష్మి గారు, C.W.C మెంబర్ & ఏ.పీ స్టేట్ ఇన్చార్జ్ (PARS)
విశిష్ట అతిథులు : శ్రీ నమ్మి అప్పారావు యాదవ్ గారు, స్టేట్ కోఆర్డినేటర్
శ్రీ మోర్త రామదాసు గారు, రిటైర్డ్ జడ్జి, అమలాపురం,
శ్రీ నూకతోటి బాబు రావు గారు, బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, (PARS)
శ్రీ కె. సి. రాజు గారు, Chief Comml Sup (Retd)
ఆహ్వానించువారు :-
డా. గూడూరి వి.జి.కె.సుధాకర్, స్టేట్ కో-ఆర్డినేటర్, (PARS) - 9440785827
శ్రీ కట్టా వేణు గోపాల కృష్ణ, అడ్వకేట్ - 9866063738
శ్రీ సిరంగుల వెంకట రత్నం, బహుజన ఉద్యమ నాయకులు గరగపర్రు - 9912637080
శ్రీ మారిశెట్టి వెంకటేశ్వర రావు, కో-ప్రెసిడెంట్ ,(PARS), కొవ్వూరు, - 7013378385
శ్రీ కోటేశ్వరరావు, అకీవీడు, - 9848786646
శ్రీ మహేశ్వరావు, అసెంబ్లీ అధ్యక్షులు, (PARS), మండపేట, - 9490599945
శ్రీ G. విజయ్ కుమార్, ఉండి, - 9912558631
శ్రీ డి.కె.వి. ప్రకాష్, సీనియర్ అడ్వకేట్, - 9394423399
శ్రీ M. జ్ఞానేష్ - 9701925835
శ్రీ మామిడి శెట్టి వెంకటేశ్వరరావు, - 9959584425
శ్రీ కదలి కోటేశ్వరరావు, - 9849434224
శ్రీ సోము రామకృష్ణ, - 9866248458
శ్రీ సుధీర్, అడ్వకేట్, - 9110372002
శ్రీ గోర్కీ - 9705671335
శ్రీ పాల కృష్ణ, - 9346110523
శ్రీ భాను, L.B చెర్ల, - 9949966995
శ్రీమతి M. నాగేంద్ర కుమారి, -8309958828
శ్రీ రామ కృష్ణ గుబ్బల, -9866047575
శ్రీ బాలం పెద్ద బాబు, ఆచంట, -9704632969
శ్రీ పితాని సత్యవేణి, తాడేపల్లిగూడెం, -9515973434
శ్రీమతి భాగ్యశ్రీ, - 8639772975
సభా నిర్వహణ : గంటా సుందర్ కుమార్, బహుజన నాయకులు - 9553329222

# భవాని మృతి కి కారకులైన దోషులను అరెస్టు చేయాలి: జిల్లా కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్ష



అమలాపురం (ప్రజా పాలన) :ఎస్టి మహిళా ఉద్యోగిని చల్లపల్లి పంచాయితీ కార్యదర్శి రొడ్డ భవాని మృతి పై హైకోర్టు న్యాయమూర్తి చేత విచారణ జరిపించి ప్రధాన నిందితుడు ఉప్పలగుప్తం మండల ఎంపీపీ భర్త దంగేటి రాంబాబు మరియు అతని అనుచరులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని భవాని న్యాయ పోరాట కమిటీ డిమాండ్ చేసింది. శనివారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురం లో కలెక్టరేట్ వద్ద భవాని న్యాయ పోరాట కమిటీ ఆధ్వర్యంలో భవాని మృతి కి కారకులైన దోషులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ దళిత గిరిజన ప్రజా సంఘాలు మరియు కుటుంబ సభ్యులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అధికార పార్టీ ప్రజాప్రతినిధుల అండ తో ఉప్పలగుప్తం మండలం ఎంపీపీ భర్త దంగేటి రాంబాబు అణువణువునా కుల వివక్షతతో చేసిన కుల పరంగా ఆర్థికంగా మానసికంగా వేధింపులు చేయడం వలనే తట్టుకోలేక భవాని బలవన్మ రణానికి పాల్పడిందని ఆరోపించారు భవానిది ఆత్మహత్య కాదని ప్రభుత్వ నిర్లక్ష్యంతో జరిగిన హత్య అని అన్నారు భవాని మృతికి దంగేటి రాంబాబు అతని అనుచరుల వేధింపులే కారణమని సభ్య సమాజమంతా తెలుసని అన్నారు కానీ అధికార పార్టీ నాయకుడిని కాపాడడానికి పోలీసులు విశ్వ ప్రయత్నం చేస్తున్నారని నిందితుడికి అండగా ప్రభుత్వము ప్రజాప్రతినిధులు ఉండడం సిగ్గుచేటని అన్నారు రెండు నెలలుగా భవానికి న్యాయం జరగాలని ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమం చేస్తుంటే ప్రభుత్వం స్పందించకపోవడం నిందితులను అరెస్టు చేయకపోవడం దళిత గిరిజనుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి నిదర్శనం అని అన్నారు ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం లో ఒక గిరిజన మహిళా ఉద్యోగిని కుల దురహంకారి వేధింపులు తాళలేక చనిపోతే నియోజకవర్గ ప్రజాప్రతినిధులు ఇప్పటికీ స్పందించకపోవడం కనీసం పరామర్శ చేయకపోవడం అన్యాయమని అన్నారు భవాని భర్త వాంగ్మూలం ఇచ్చినా గాని పోలీసులు ఏకపక్షంగా దంగేటి రాంబాబును కాపాడుతున్నారని అన్నారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి దళిత గిరిజనులకు రక్షణ కల్పించాలని భవాని మృతికి కారకుడైన ప్రధాన నిందితుడు దంగేటి రాంబాబు అతని అనుచరులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు భవాని కేసును నీరు కారుస్తున్న విచారణ అధికారి ని తొలగించి హైకోర్టు న్యాయమూర్తి చేత విచారణ జరిపించాలని భవాని కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు భవానికి న్యాయం జరిగేంత వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామని తెలిపారు ఈ దీక్ష శిబిరంలో భవాని కుటుంబ సభ్యులు. మరియు వి సి కె పార్టీ జిల్లా అధ్యక్షులు బొంతు రమణ రైతు కూలీ సంఘం నాయకులు కొండా దుర్గారావు మచ్చ నాగయ్య పిడిఎం రాష్ట్ర కార్యదర్శి దీపాటి శివప్రసాద్ ఎరుకుల హక్కుల సంక్షేమ సంఘం నాయకులు బండారు సత్యనారా యణ ఎన్ టి ఎఫ్ నాయకులు ఉప్పు శ్రీను పి డి ఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు దళిత సేన అధ్యక్షులు డేవిడ్ అంబేద్కర్ మాల మహానాడు నాయకులు జల్లి శ్రీను గెద్దాడ బుద్ధరాజ్ గిడ్ల వెంకటేశ్వరరావు శెట్టిబత్తుల తులసిరావు భారతి అంజి మొగిలి సురేష్ రేవు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు వైసీపీలో భారీ మార్పులు

గుంటూరు, సెప్టెంబర్ 2, :గుంటూరు వైసీపీలో భారీ మార్పులు జరగబోతున్నాయా? వచ్చే ఎన్నికల నాటికి ఎమ్మెల్యేలకు స్థాన చలనం కలగనుందా? సీనియర్ నేత, రాష్ట్ర మంత్రి అంబటి మరో నియోజకవర్గం చూసుకోవాల్సిన పరిస్థితులు దాపురించాయా? అనే చర్చ ఉమ్మడి గుంటూరు జిల్లాలో జోరుగా సాగుతోంది. వైసీపీలోకి మంగళగిరి బీసీ నేతల చేరికలతో కొత్త సమీకరణలు తెరమీదకొస్తు న్నాయి. వచ్చే ఎన్నికల్లో మంత్రి అంబటి రాంబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న సత్తెనపల్లి సీటును ఆర్కేకు కేటాయించనున్నారన్న ప్రచారం ఊపందుకుంది. చంద్రబాబు నాయుడు తనయుడు నారా లోకేష్‌పై సిట్టింగ్ ఎమ్మెల్యే ఆళ్ల రామక్రిష్ణా రెడ్డిని గెలిపిస్తే మంత్రిని చేస్తానని వైసీపీ అధినేత వైఎస్ జగన్ గతంలో మాటిచ్చారు. అయితే అప్పటికే మంగళగిరిలో కీలక నేతలుగా ఉన్న మాజీ మంత్రి మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమలను చంద్రబాబు పార్టీలోకి ఆహ్వానించి చక్రం తిప్పారు. అమరావతి రాజధాని ప్రాంతంలో ప్రధాన నియోజకవర్గంగా ఉన్న మంగళగిరి సీటును ఎలాగైనా దక్కించుకోవాలని టీడీపీ అధినేత పావులు కదిపారు. పార్టీలో చేరిన నేతలు వియ్యంకులే కావడంతో తమకే టిక్కెట్ దక్కుతుందని భావించారు. అందరు నేతలను పార్టీలోకి చేర్చుకున్న తర్వాత అనూహ్యంగా లోకేష్‌ను రంగంలోకి దింపడంతో నేతలు అసహనానికి గురయ్యారు. టిక్కెట్ ఇస్తామని చెప్పి మోసం చేశారంటూ కాండ్రు కమల బాహాటంగానే విమర్శలు గుప్పించారు కూడా. గత ఎన్నికల్లో నారా లోకేష్ ఓటమితో నేతలు సహకరించలేదన్న వాదనలు వినిపించాయి. తదనంతరం మాజీ మంత్రి హనుమంతరావు సహా కాండ్రు కమల కూడా వైసీపీలో చేరిపోయారు. గత ఎన్నికల వేళ వైసీపీ నేతలతో అంతర్గత ఒప్పందం జరిగిందన్న ప్రచారం కూడా సాగింది. నారా లోకేష్‌పై గెలుపునకు సహకరిస్తే వచ్చే ఎన్నికల్లో మంగళగిరిలో కీలకమైన చేనేత వర్గానికే పార్టీ టిక్కెట్ ఇస్తామని హామీ ఇచ్చినట్లు చర్చ నడిచింది. ఎట్టకేలకు సిట్టింగ్ ఎమ్మెల్యే ఆర్కే చంద్రబాబు తనయుడిపై ఘన విజయం సాధించి తీవ్ర పరాభవం రుచిచూపించారు. ఇప్పుడు తాజాగా జరుగుతున్న పరిణామాలు కూడా గతంలో ప్రచారంలోకి వచ్చిన వాదనలకు బలం చేకూర్చేలా ఉన్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2014లో మంగళగిరి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఆర్కే చేతిలో ఓటమిపాలైన గంజి చిరంజీవి వైసీపీలో చేరడం కొత్త చర్చకు తెరలేపింది. 2014లో చిరంజీవి ఓడిపోయినప్పటికీ ఆయనే టీడీపీ ఇన్‌చార్జిగా.. మున్సిపల్ చైర్మన్‌గా కొనసాగారు. పార్టీలో కీలక నేతగా చక్రం తిప్పారు. నారా లోకేష్‌కు సైతం అండగా నిలిచారు. టీడీపీ కీలక నేతగా ఉన్న ఆయన ఇటీవల వైసీపీ కండువా కప్పుకోవడంతో మంగళగిరి సీటు చేనేత వర్గానికి కేటాయించడం దాదాపు ఖరారైపోయిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. అయితే అక్కడి నుంచి రెండు సార్లు గెలిచిన ఆర్కే సత్తెనపల్లి నుంచి బరిలోకి దిగుతారన్న ప్రచారం సాగుతోంది. ఇటీవల సీఎం జగన్ చేయించిన సర్వేలోనూ అభ్యర్థులను మార్చాల్సిన అవసరముందన్న నియోజకవర్గాల్లో సత్తెనపల్లి, మంగళగిరి కూడా ఉన్నట్లు చెబుతున్నారు. మంగళగిరిలో బీసీ నేతల చేరికలతో ఆర్కేకు స్థాన చలనం తప్పేలా కనిపించడం లేదు. దీంతో ఆయన సత్తెనపల్లి నుంచి పోటీ చేసేందుకు ఉత్సాహం చూపుతున్నట్లు స్థానిక నేతలు చెప్పుకుంటున్నారు. ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న అంబటి రాంబాబు మరో నియోజకవర్గానికి మారతారని చెబుతున్నారు. క్రిష్ణా జిల్లా అవనిగడ్డ నుంచి అంబటి బరిలోకి దిగొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిజానికి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనే ఆర్కే సత్తెనపల్లి సీటును ఆశించి భంగపడ్డారు. 2009 ఎన్నికల్లో సీటు కోసం తీవ్రంగా శ్రమించారన్న ప్రచారం కూడా ఉంది. అయితే ఆ ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వర్ రెడ్డికే టిక్కెట్ దక్కడంతో ఆర్కే సైలెంట్ అయిపోయారు. నియోజకవర్గంలో ఆయనకు బంధువర్గం, స్నేహితులు ఉండడంతో సత్తెనపల్లి నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారని చెబుతున్నారు. వర్గవిభేదాలతో టీడీపీ కూడా అంత బలంగా లేకపోవడం కలిసొచ్చే అంశంగా చెప్పొచ్చు. మరి సీఎం జగన్ ఏం చేస్తారో వేచిచూడాలి మరి!!

# ఏపీలో 26 ప్రాంతాల్లో రోప్ వే ఏర్పాటు

విజయవాడ, సెప్టెంబర్ 2, :ఏపీకి రోప్ వే హంగులు రానున్నాయా? పర్యాటక ప్రాంతాలు కొత్త రూపు సంతరించుకోనున్నాయా? అంటే అవుననే అంటున్నారు అధికారులు. ఏపీలో పర్యాటకుల ద్వారా మరింత ఆదాయం సమకూర్చుకునేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మొత్తం 26 టూరిస్ట్ ప్రాంతాల్లో రోప్‌వే వేసేందుకు ముమ్మర కసరత్తు జరుగుతోంది. పర్వతమాల ప్రాజెక్టులో భాగంగా రోప్ వేల ఏర్పాటు చేయనుంది. విజయవాడ కనకదుర్గమ్మ కొండపైకి, కృష్ణా నది మీదుగా ఈగలపెంట నుంచి శ్రీశైలం వరకు రోప్ వే ఏర్పాటుకు డీపీఆర్ సిద్ధం అయిందని తెలుస్తోంది. మరో ఆరు చోట్ల డీపీఆర్‌ల తయారీకి ముమ్మర కసరత్తు చేస్తోంది పర్యాటక శాఖ. ఇప్పటికే నేషనల్ లాజిస్టిక్ మేనేజ్మెంట్ లిమిటెడ్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది ఏపీటీడీసీ. మూడు నాలుగు నెలల్లో కార్యరూపం దాల్చే అవకాశం వుందని అంటున్నారు పర్యాటక శాఖ అధికారులు. రోప్ వేల నిర్వహణ బాధ్యతను నేషనల్ లాజిస్టిక్ మేనేజ్మెంట్ లిమిటెడ్ చేపట్టనుంది. ఏపీకి రోప్‌వే హంగులు రాబోతున్నాయి. కేంద్ర పథకం పర్వత మాల పథకంలో భాగంగా ఏపీలో మొత్తంగా 26 ప్రాంతాల్లో రోప్ వే ఏర్పాటు చేయడానికి కసరత్తు ముమ్మరంగా చేస్తున్నారు అధికారులు. విజయవాడ కనకదుర్గమ్మ కొండ ఇంద్రకీలాద్రి పైకి రోప్ వే ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే డీపీఆర్ సిద్ధమైంది. ఏపీలో అతి తక్కువ ప్రదేశాల్లో మాత్రమే రోప్‌వే అందుబాటులో ఉంది. ప్రస్తుతం శ్రీశైలం, విశాఖ కైలాసగిరి వంటి ప్రాంతాల్లో తప్ప.. మిగిలిన చోట్ల ఎక్కడ రోప్ వే లేదు. అయితే ఆ కొరత తీర్చేందుకు.. పైనుంచి ప్రకృతి అందాలను చూసి పులకరించేందుకు ఏపీలో భారీ ఎత్తున రోప్‌వేలను ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధమవుతోంది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 26 చోట్ల రోప్‌వేలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన పర్వత మాల ప్రాజెక్టులో భాగంగా ఏపీకి రోప్ వే హంగులను అద్దేందుకు సిద్ధమవుతున్నారు అధికారులు. ఏపీలో మొత్తంగా 26 పర్యాటక, ఆధ్యాత్మిక ప్రదేశాల్లో రోప్ వేలను ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ.. ఎన్‌హెచ్ఏఐకు అనుబంధ సంస్థ అయిన నేషనల్ లాజిస్టిక్ మేనేజ్మెంట్ లిమిటెడ్ అనే సంస్థతో ఏపీటీడీసీ ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకుంది. దీంట్లో భాగంగా ఇప్పటికే రెండు చోట్ల డీపీఆర్‌లు కూడా సిద్ధంగా ఉన్నట్టు సమాచారం. ఇంద్రకీలాద్రి పైకి రోప్‌వే ఏర్పాటు.. అలాగే తెలంగాణ ప్రాంతంలోని ఈగల పెంట నుంచి శ్రీశైలం వరకు కృష్ణా నది మీదుగా రోప్ వే ఏర్పాటుకు డీపీఆర్‌లు సిద్ధంగా ఉన్నాయి. ఇవి కాకుండా.. మరో ఆరు చోట్ల వీలైనంత త్వరగా డీపీఆర్‌లు సిద్ధం చేసేందుకు కసరత్తు ముమ్మరం చేశారు అధికారులు. గండికోట, శ్రీకాళహస్తి, కటికి వాటర్ ఫాల్స్, లంబసింగి, అన్నవరం, గగన్‌మహల్–పెనుకొండ పర్యాటక ప్రదేశాల్లో రోప్ వే ఏర్పాటుకు త్వరలోనే డీపీఆర్‌లు సిద్ధం కానున్నట్టు సమాచారం. వీటిల్లో వీలైనంత త్వరగా రోప్‌వేల ఏర్పాటు పూర్తి చేయాలని భావిస్తున్నారు అధికారులు. వీలుంటే మరో మూడు నాలుగు నెలల్లో కార్యరూపం దాల్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక రోప్‌వేల నిర్వహణ బాధ్యతను పూర్తిగా నేషనల్ లాజిస్టిక్ మేనేజ్మెంట్ లిమిటెడ్ సంస్థే చేపట్టనుంది. దీని ద్వారా వచ్చే ఆదాయాన్ని కూడా సదురు సంస్థే తీసుకోనున్నట్టు సమాచారం. అనుకున్న విధంగా రోప్‌వే హంగులు ఏపీకి వస్తే.. ఏపీని న్యూలుక్‌లో చూడొచ్చని పర్యాటకులు ఉవ్విళ్లూరుతున్నారు.

# రియల్ టైం క్రాప్‌లో ఏపీకి అగ్రస్థానం..

**రాష్ట్రంలో పకడ్బందీగా ఈ–క్రాప్ నమోదు**




అమరావతి, ప్రజాపాలన ప్రతినిధి : కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన రియల్ టైం క్రాప్ మేనేజ్ మెంటు–లో ఏపీ అగ్రస్థానంలో నిలిచింది. రైతు భరోసా కేంద్రాల పర్యవేక్షణలో ఈ–క్రాప్ విధానాన్ని పకడ్బందీగా అమలు చేయటం ద్వారానే సర్వే నెంబర్ల వారీగా సాగవుతున్న పంటల వివరాలు, విస్తీర్ణం కూడా రియల్ టైం క్రాప్ మేనేజ్‌మెంట్ లో నమోదయిందని అధికారులు చెబుతున్నారు. గడిచిన మూడేళ్ళుగా ఈ–క్రాప్ నమోదులో నిర్దిష్టమైన విధానాలు అవలంబిస్తూ రైతుల్లో అవగాహన పెంచటం ద్వారానే ఇది సాధ్యమైంది..ఏపీలో ఈ–క్రాప్ విధానాలనే అనుసరిస్తూ దేశవ్యాప్తంగా అగ్రిస్టాక్ డిజిటల్ కేంద్రాలు ఏర్పాటు–చేసేందుకు కేంద్రం నిర్ణయించిందని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు ఈ–క్రాప్ నమోదు చేసిన రైతుతందరికీ ఈ–కేవైసీ నమోదును ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు..మీ పంట మీరు తెలుసుకోండి అనే పేరుతో ఆర్బీకేల ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ధాన్యం కొనుగోలుతో పాటు ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమాతో పాటు రైతుకందించే అన్ని సబ్సిడీలు, రాయితీలు, సంక్షేమ పథకాలన్నిటికీ ప్రామాణికంగా ఉండటంతో ఈ–క్రాప్ కు రోజురోజుకు ప్రాధాన్యత పెరుగుతోందని అధికారులు చెబుతున్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



వినుకొండ సెప్టెంబర్ 02 (ప్రజాపాలన ప్రతినిధి) : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వినుకొండ నియోజకవర్గంలోని నూజండ్ల మండలం నూజండ్ల గ్రామం లో నిర్వహించగా, గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది..జగన్న ప్రభుత్వం వచ్చిన దగ్గర నుండి జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ నవరత్న పథకాల ద్వారా ఒక్కొక్క కుటుంబానికి సగటున 1లక్ష రూపాయల వరకు ఆర్థిక సహాయం అందుతుందని, అందుకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కి మరియు వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు కి కృతజ్ఞతలు తెలిపుతూ, మళ్లీ.. మళ్లీ జగన్న నాయకత్వం లో లివినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు లి ఇక్కడ శాసనసభ్యులు గా అత్యధిక మెజార్టీతో గెలుపొంతారని ప్రజలు ఈ కార్యక్రమం ద్వారా వారి స్పందన తెలియజేశారు. ఈ సందర్భంగా వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ. ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ నవరత్న పథకాలు ప్రతి గడపకు అందుతున్నాయా, లేదా అని అలాగే గ్రామంలోని పలు సమస్యలను తెలుసుకోవటం కోసం స్వయంగా శాసనసభ్యులు వారే మండల స్థాయి అధికారుల తో కలిసి గడప గడపకు తిరిగి వారి యొక్క సమస్యలను తెలుసుకొని తక్షణ పరిష్కారం అందించే విధంగా ఈ కార్యక్రమం జరుగుతుందని, ఎటువంటి సమస్యలు ఉన్నా, నాకు తెలియపరిస్తే తక్షణ పరిష్కారం చూపుతామని గ్రామ ప్రజలకు తెలియజేశారు. అనంతరం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం లోనే వాలంటీర్ల తో కలిసి ప్రతి ఇళ్లు తిరిగి వారే స్వయంగా అర్హులైన వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేసి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. స్వయంగా శాసనసభ్యులు వారే మాకు ఇలా ఫించన్ పంపిణీ చేయటం మాకు ఎంతో సంతోషంగా ఉందని వృద్ధులు తెలిపారు.

## వినుకొండ ఎమ్మార్వోకి వినతిపత్రం అందజేత




వినుకొండ ప్రజాపాలన ప్రతినిధి: రాష్ట్ర తెలుగుదేశంపార్టీ ఇచ్చిన పిలుపుమేరకు పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు జీ.వీ.ఆంజనేయులు ఆదేశాల మేరకు తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ఉచిత రేషన్ పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ పేదలకు శాపంగ మారిన ప్రభుత్వం మాకొద్దు. పోవాలి జగన్.. రావలి చంద్రన్న అంటూ తహశీల్దార్ కార్యాలయంలో నినాదాలు చేస్తూ రేషన్ పంపిణీలో అక్రమాలను నిరసిస్తూ వినుకొండ పట్టణ, రూరల్ మండలాల టీడీపీ ఆధ్వర్యంలో ఆందోళన,వినుకొండ యమ్ ఆర్ ఓ కి కు వినతిపత్రం అందచేశారు.

## దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి ఘన నివాళులు అర్పించిన మంత్రి విశ్వరూప్, ఎంపీ అనూరాధ



అమలాపురం( ప్రజా పాలన): దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా అమలాపురం స్థానిక హై స్కూల్ సెంటర్లో డాక్టర్ వైఎస్ఆర్ వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి చేసి ఘన నివాళులు అర్పించారు ఈ. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రివ పినిపే విశ్వరూప్ అమలాపురం ఎంపీ చింతా అనూరాధ హాజరయ్యారు. అనంతరం మున్సిపల్ సానిటరీ వర్కర్స్ కి చీరలు పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంసాని నాని డెల్టా చైర్మన్ కుడుపూడి బాబు మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్యనారాయణ మణి రాష్ట్ర ముఖ్యకాల కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్య శైలజ కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర నాగర్ వెంకటేశ్వరావు దొంగ చిన్న రాజా రమేష్ గోవ్వాల రాజేష్ మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నాని రాజు తిక్కిరెడ్డి వెంకటేష్ ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి రాష్ట్ర మాజీ కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ అబ్దుల్ ఖాదర్ ఒంటెద్దు వెంకన్న నాయుడు గనిశెట్టి రమణ లాల్ అమలాపురం జడ్పిటిసి పందిరి హరి సరళ రామకృష్ణ పుండ్రు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

## దివంగత రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి నివాళి అర్పించిన ఉప్పాడ సూరిబాబు



భీమిలి,ప్రజాపాలన ప్రతినిధి : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి కీర్తిశేషులు డాక్టర్ రాజశేఖర్ రెడ్డి 13వ వర్ధంతి సందర్భంగా మాజీ ఎంపీపీ ఉప్పాడ సూరిబాబు రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.సూరిబాబు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన ప్రతి సంక్షేమ పథకం పేదవానికి ఒక ఆశా కిరణం అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బట్ట రామకృష్ణ బోయ వెంకటరమణ మామిడి కిరణ్ కుమార్ ధల్లి పాపారావు నరసింహారావు మరియు ఇతర వైసిపి నాయకులు పాల్గొనినారు.

## ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు




రాజుపాలెం ప్రజాపాలన ప్రతినిధి: జనసేన అధినేత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్51వ జన్మదిన పురస్కరించుకొని రాజుపాలెం మండల జనసేన పార్టీ ఆధ్వర్యంలోని రాజుపాలెం మండలం వీరమ్మ కాలనీలో దీనమ్మ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ నిర్వహిస్తున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అనాధ పిల్లల వృద్ధుల ఆశ్రమంలో శుక్రవారం మధ్యాహ్నం పూట చిన్నారులు ఉర్దులుమధ్య కట్ చేసి వారి చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు తోట నరసయ్య మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు ఆయన ఎన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని తెలిపారు నిరంతరం మా జనసేన పార్టీ తరఫున సహకారాలు ఆశ్రమానుకుంటాయని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు భక్తుల హనుమంతరావు కార్యదర్శి కె వరప్రసాద్ తమ్మిశెట్టి మహేష్ గల్బా నాగేశ్వరరావు వీరమ్మ కాలనీ అధ్యక్షుడు దూదేకుల శీన్ భాష అనుపాలెం గ్రామ అధ్యక్షుడు తోట లక్ష్మీనారాయణ జన సైనికులు జక్క రామాంజనేయులు తోట రత్నాకర్ అంచుల అంచుల అనీష్ బి రామకోటేశ్వరరావు అంకాల డేవిడ్ పసుపులేటి మల్లికార్జున తోట శీను పి శ్రీకాంత్ గాజుల మల్లికార్జునరావు కటారి రామాంజనేయులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు

## డాక్టర్ వైఎస్ఆర్ జనహృదయాల్లో నేటికీ కొలువై ఉన్నారు: ఎమ్మెల్యే పేర్ని నాని



మచిలీపట్నం టౌన్ : 02 సెప్టెంబర్ ప్రజాపాలన:తనదైన పాలనతో తెలుగు ప్రజల అభిమానం చూరగొన్న నేత కారణ జన్ముడు ,మహనీయుడు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి భౌతికంగా దూరమైనా జనహృదయాల్లో నేటికీ కొలువై ఉన్నారని మాజీ మంత్రివర్యులు, కృష్ణాజిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మచిలీపట్నం శాసనసభ్యులు పేర్ని వెంకట్రామయ్య ( నాని ) పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం దివంగత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 13 వ వర్ధంతి సందర్భంగా మచిలీపట్నం జిల్లా కోర్టు సెంటర్ లోని వైఎస్సార్ విగ్రహానికి పూలదండలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్ని నాని మాట్లాడుతూ, రాజకీయాలలో ఎన్నాళ్ళు పదవిలో ఉన్నామనేది ముఖ్యం కాదని, ఉన్న కొద్ది కాలం ప్రజల హృదయాలకు ఎంత చేరువైయ్యమన్నది దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జీవితాన్ని చూస్తే అర్ధమవుతుందన్నారు. ఆయన జీవించిన కాలం , ముఖ్యమంత్రిగా 5 సంవత్సరాల మూడు నెలల కాలం ఎందరికో ఆదర్శం అని అన్నారు. పింఛనుతో ఆకలి తీర్చుకుంటున్న పండుటాకు ప్రతి అన్నం మెతుకులోనూ వైఎస్ రాజశేఖరరెడ్డిని చూసుకుంటుందని, ఫీజు రాయితీ తో ఎదిగిన ప్రతి సరస్వతీ పుత్రుడు రాజన్నరుణం తీర్చుకోలేమంటూ చేతులు జోడిస్తాడని, ఆరోగ్యశ్రీతో పునర్జన్మ పొందిన నిరుపేదలైతే ఆ ఆత్మీయ నేతను నిత్యం దేవుడిలా కొలుస్తారని ఎమ్మెల్యే పేర్ని నాని కొనియాడారు. గతంలో ఏ ఒక్క ముఖ్యమంత్రి అయినా.. ఏ రాజకీయనాయకుడు అయినా ప్రజల కోసం అన్ని సంక్షేమ పథకాలు తీసుకొచ్చాడా? అందరూ బాగుండాలి. అన్ని ప్రాంతాలూ బాగుండాలి. అందరికీ నీరు, నిధులు, పరిపాలన దక్కితేనే న్యాయం అని నమ్మిన మహానుభావుడు వైయస్సార్ అని అన్నారు. ప్రజా సంక్షేమమే శ్వాసగా, అభివృద్ధే ధ్యాసగా పాలన సాగించి భారతదేశంలోని మిగిలిన రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఒక ఆదర్శ నేతగా మిగిలారని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కీర్తి ఈ భూమి నిలిచి ఉన్నంతవరకు నిలిచి ఉంటుందన్నారు. రాజకీయ నేతలు ప్రజల మధ్య పాదయాత్ర చేసి కష్ట సుఖాలు తెలుసుకొనే ధోరణి అప్పటి వరకు లేదని, వైయస్సార్ తోనే పాదయాత్ర మొదలైందన్నారు ఆ తర్వాత ఆయన కుమారుడు జగన్ సుదీర్ఘ పాదయాత్ర చేశారని అన్నారు. ఆ మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి తనకు గొప్ప స్ఫూర్తి , ఆదర్శమని, ఆయన ప్రభుత్వంలో తానూ ఒక శాసనసభ్యునిగా కొనసాగడం, ఆయన పక్కన కూర్చోవడం పలు సందర్భాలలో వివిధ అంశాలపై మాట్లాడటం ఆయనను స్పృశించి ఆ మహానేతతో నడిచే బాగ్యం లభ్యం కావడంతో తన జన్మ సార్ధకతమైందని భావిస్తానని ఎమ్మెల్యే పేర్ని నాని భావోద్వేగంతో అన్నారు. అనంతరం యువ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి ( కిట్టు ) ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా గల ఆశీర్వాద్ భవన్ లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. పలువురు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొని రక్తాన్ని దానం చేశారు. దాదాపు 65 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు బ్లడ్ బ్యాంకు నోడల్ అధికారి డాక్టర్ త్యాగి, డాక్టర్ శ్యామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు లంకా సూరిబాబు, తంటిపూడి కవితా థామస్ నోబుల్, మాజీ మునిసిపల్ చైర్మెన్ వైస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు సలార్ దాదా, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ షేక్ ముస్తఫా( అచ్చేబా ), వైస్ ఛైర్మెన్ తోట సత్యనారాయణ, పార్టీ అధికార ప్రతినిధి మాదివాడ రాము, రాష్ట్ర గిడ్డంగుల శాఖ మాజీ అధ్యక్షులు బూరగడ్డ రమేష్ నాయుడు, పలు డివిజన్ కార్పొరేటర్లు, వివిధ గ్రామాల సర్పంచులు వైసీపీ నాయకులు, అభిమానులు, వైయస్ఆర్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వైయస్సార్ ఆశయ సాధనకు జగన్ వెంట నడుద్దాం



నత్తెనపల్లి పట్టణం/రూరల్/ ముప్పాళ్ళ. ప్రజాపాలన :శాశ్వత సంక్షేమ పథకాల రూపకర్త వైయస్ రాజశేఖర్ రెడ్డి అని, ఆయన ఆశయాల సాధన కోసమే మన మందరం యువ ముఖ్యమంత్రి, వైయస్సార్ తనయుడు జగన్మోహన్ రెడ్డి వెంట నడుస్తున్నామని రాష్ట్ర జల వనరుల శాఖామాత్యులు అంబటి రాంబాబు పేర్కొన్నారు. శుక్రవారం మహానేత, స్వర్గీయ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర రెడ్డి 13వ వర్ధంతిని పురస్కరించుకొని నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజా సమస్యలను తెలుసుకొనేందుకు, ప్రజలకు చేరువయ్యేందుకు 1600 లకిలోమీటర్ల పాదయాత్ర చేసినప్పుడు ఆయనతో కలిసి నడిచిన అనుబంధం నాకు ఉందన్నారు. వైయస్సార్ మరణాన్ని రాష్ట్రం జీర్ణించుకోలేక పోయిందన్నారు. ఎంతోమంది ప్రజలు తీరని క్షోభకు గురయ్యారని వివరించారు. రాజశేఖర్ రెడ్డి మరణం తర్వాత జరిగిన ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కాలేదని తక్కువ స్థానాలు గెలుపొందినా అనేక ఇబ్బందులకు గురయ్యారన్నారు. గెలిచిన ఎమ్మెల్యేలను ఆకున్నారన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని అడగకు ప్రయత్నించినా 2019 లో జరిగిన ఎన్నికల్లో చరిత్రలో నిలిచిపోయే విజయాన్ని వైయస్ జగన్మోహన్ రెడ్డికి ప్రజలు అందించారని గుర్తు చేశారు. వైయస్సార్ ఆశయాల సాధనకు ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే మరికొన్ని సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తున్న ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. రాష్ట్ర చరిత్రలో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన ఘనత వైఎస్సార్కే దక్కిందన్నారు. అనంతరం 13వ వార్డులో కౌన్సిలర్ బండి రాజ్యలక్ష్మి, మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. నత్తెనపల్లి రూరల్ మండలంలో కంటేపూడి, కొమెరపూడి గ్రామాల్లో జరిగిన వైఎస్ఆర్ 13వ వర్ధంతి కార్యక్రమాలలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్, రూరల్ మండల పార్టీ అధ్యక్షులు రాయపాటి పురుషోత్తమ రావు, ఉమ్మడి గుంటూరు జిల్లా రైతు సలహా మండల సభ్యులు కళ్ళం, విజయభాస్కరరెడ్డిల ఆధ్వర్యంలో జరిగాయి. ఆ గ్రామాల వైయస్సార్ విగ్రహాలకు పూలమాల వేసి మంత్రివర్యులు అంబటి రాంబాబు నివాళులర్పించారు. ముప్పాళ్ళ మండలం, చాగంటివారిపాలెం గ్రామాలలో జరిగిన వైయస్సార్ 13 వర్ధంతి కార్యక్రమాన్ని మండల నాయకులు ఎంజీఆర్ లింగారెడ్డి,సిరిగిరి గోపాలరావు , ఇతర మండల నాయకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జలవనరుల శాఖ మాత్యులు రాంబాబు ముందుగా వైయస్సార్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ..ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ నాయకులు చల్లంచర్ల సాంబశివరావు, ఉమెన్ ఫైనాన్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ గీతా హసంతి , వైస్ చైర్మన్లు షేక్ నాగూర్ మీరాన్ , కోటేశ్వరరావు నాయక్, కౌన్సిలర్లు అచ్యుత శివప్రసాద్, మక్కెన అచ్చయ్య, చిట్టా విజయ భాస్కర్ రెడ్డి, వెలుగూరి శరత్, కోడిరెక్క దేవదాస్, పెద్దింటి వెంకటేశ్వర్లు, ముప్పాళ్ల సర్పంచ్ సతీష్, రెండెద్దుల వెంకటేశ్వర రెడ్డి తదితరులున్నారు.

## మెరుగైన వైద్యం అందించడమే "కోడెల" ఛారిటబుల్ ట్రస్ట్ లక్ష్యం



సత్తెనపల్లి ప్రజాపాలన ప్రతినిధి: ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతోనే నాడు తన తండ్రి బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ నిర్మాణంలో పాలు పంచుకున్నారని తెలుగుదేశం పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ నాయకులు యువ నేత డాక్టర్ కోడెల శివరాం తెలిపారు.స్వర్గీయ డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ బసవతారకం క్యాన్సర్ కేర్ హాస్పిటల్ సహకారంతో శుక్రవారం సత్తెనపల్లి రూరల్ మండలం లక్కరాజు గార్లపాడు గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన యువ నేత డాక్టర్ కోడెల శివరాం ముందుగా అన్న నందమూరి తారకరామారావు, స్వర్గీయ డాక్టర్ కోడెల శివప్రసాదరావుల ప్రతిమలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా యువ నేత డాక్టర్ కోడెల శివరాం మాట్లాడుతూ క్యాన్సర్ రోగానికి ప్రతి ఒక్కరికి అందుబాటులో మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో అన్న నందమూరి తారక రామారావు క్యాన్సర్ కేర్ హాస్పిటల్ నిర్మాణం చేపట్టినప్పుడు తన తండ్రి స్వర్గీయ డాక్టర్ కోడెల శివప్రసాదరావు కి అప్పజెప్పిన బాధ్యతలును దిగ్విజయంగా పూర్తి చేశారన్నారు. అంతేకాకుండా తన తండ్రి ప్రతి ఒక్కరు అవయవదానంలో పాలుపంచుకోవాలని ఉన్నతమైన ఆశయంతో గిన్నిస్ రికార్డు స్థాయిలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు .అదేవిధంగా తన తండ్రి ఆశయాలను కొనసాగిస్తూ రాజకీయంగానే కాక సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా ముందుంటామని యువ నేత డాక్టర్ కోడెల శివరాం తెలిపారు. తన తండ్రి పేరు మీద ట్రస్టు ఏర్పాటు చేసిన నాటి నుండి నేటి వరకు ఉచిత మెగా వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, సామాజిక సేవా కార్యక్రమాలు, బసవ తారక రామా క్యాన్సర్ కేర్ హాస్పిటల్ నందు ప్రతి శనివారం ఉచిత అన్నదాన కార్యక్రమం వంటి అనేక కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని డాక్టర్ కోడెల శివరాం తెలిపారు. అనంతరం గ్రామాల్లోని ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యానికి సంబంధించిన వైద్య పరీక్షలు పూర్తి స్థాయిలో ఉచితంగా చేయించుకున్నారు. ఈ ఉచిత వైద్య శిబిరం నందు ప్రతి ఒక్కరికీ పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ అయిన వారికి తగిన ట్రీట్మెంట్ అందజేయడం జరుగుతుందని వైద్య అధికారులు తెలిపారు. గ్రామ స్థాయిలో ఇటువంటి అత్యున్నతమైన హాస్పిటల్ యొక్క వైద్య శిబిరాన్ని ఉచితంగా ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని వైద్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు యువ నేత డాక్టర్ కోడెల శివరాం కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గోకవరం నూతన ఎంపీడీవోగా కె వి ఎస్ ఎస్ మూర్తి



గోకవరం సెప్టెంబర్ 2 ప్రజా పాలన ప్రతినిధి :గోకవరం నూతన ఎంపీడీవో గా కె వి ఎస్ ఎస్ మూర్తి శుక్రవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈయన సీతానగరం మండలం నుండి గోకవరం మండలం ఎంపీడీవో గా రావడం జరిగింది.ఇంత వరకు ఇంచార్జ్ ఎంపీడీవోగా వ్యవహరించిన శ్రీనివాసుదొర శుక్రవారం ఈయనకు పదవి బాధ్యతలు అప్పగించడం జరిగింది.ఈ సందర్భంగా నూతన ఎంపీడీవో కెవిఎస్ఎస్ మూర్తి మాట్లాడుతూ గోకవరం మండలం అభివృద్ధికి ప్రజాప్రతినిధుల సహకారంతో అన్ని విధాల కృషి చేయడం జరుగుతుందన్నారు.




ప్రజాపాలన

సంపాదకీయం

శనివారం 03, సెప్టెంబరు 2022

## పంటలకు ఎంఎస్‌పి చట్టం అత్యవసరం

చాలా పెద్ద మొత్తంలో వచ్చి పడుతున్న విదేశీ పంటలతో, వస్తువులతో దేశీయ వ్యవసాయం కునారిల్లుతున్నది. డబ్ల్యుటిఓ ఒప్పందాలు ఎలా అమలుపరచాలా అనే గొడవ తప్పితే ఈ వ్యవసాయ సంక్షోభంలో భారత రైతులు ఎంతమంది ఆత్మహత్యలు చేసుకొంటున్నారనేది పాలక వర్గాలకు పట్టడంలేదు. మన వ్యవసాయాన్ని, రైతును కాపాడుకోవాలంటే స్వామినాథన్ కమిషన్ చెప్పినట్టు (సి2ం50) రైతులు పెట్టిన ఖర్చుల పైన 50 శాతం ఆదాయం వచ్చేలా కనీస మద్దతు ధర చట్టం చెయ్యాలి. లేనిపక్షంలో భారతదేశ వ్యవసాయాన్ని, రైతును కాపాడలేరు.సంవత్సరానికి 10 వేల మంది రైతులు దేశవ్యాప్తంగా ఆత్మహత్యలు చేసుకోవడాన్ని బట్టే వ్యవసాయం తీవ్రమైన సంక్షోభంలో వుందని ఎవరికైనా అర్థమవుతుంది. ఈ సంక్షోభాన్ని పరిష్కరిస్తానని పంటలకు కనీస మద్దతు ధర చట్టం తీసుకొస్తానని దేశవ్యాప్తంగా 13 నెలల పాటు సాగిన రైతు ఉద్యమాల విరమణ ఒప్పంద సందర్భంగా రైతులకు మోడీ వాగ్దానం చేశారు. విద్యుత్ బిల్లును కూడా రైతు సంఘాలతో సంప్రదించిన తర్వాతనే పార్లమెంటులో ప్రవేశపెడతామని కేంద్ర ప్రభుత్వం చెప్పింది. ఈ వాగ్దానాలను మోడీ ప్రభుత్వం నిలబెట్టుకోలేదు. కానీ వ్యవసాయ సంక్షోభానికి పరిష్కారాలు వెతికేందుకు కమిటీ వేస్తున్నట్టుగా మోడీ ప్రకటించారు. ఆ కమిటీలో రైతు వ్యతిరేక చట్టాలను తయారు చేసిన అధికారులు, ఆర్‌ఎస్‌ఎస్ అభిమానులైన రైతు నాయకులు 12 మంది వరకు ఉన్నారు. 3 స్థానాలను ఖాళీ పెట్టి ఆ ఖాళీలలో ఎస్‌కెఎం నాయకులు చేరాలంటూ ప్రభుత్వం పకటించింది. కనీస మద్దతు ధరల చట్టం తయారు చేయటం కూడ ఈ కమిటీ కర్తవ్యాల్లో వున్నదా అని ఎస్‌కెఎం నాయకత్వం బహిరంగంగా ప్రశ్నించినదానికి కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పలేదు. కీలకమైనటువంటి ఈ ఎంఎస్‌పి చట్టాన్ని తప్పక తీసుకువస్తామని ప్రభుత్వం సమాధానం చెప్పకపోవటమే కేంద్ర ప్రభుత్వం డ్రామా ఏమిటో అందరికి అర్థమైంది. అందువల్ల నిరుపయోగమైన ఈ ప్రభుత్వ కమిటీలో ఎస్‌కెఎం సభ్యులు చేరకపోవటం సమంజసమే. పెట్రోలు, డీజిల్ ధరలు ఈ కాలంలో విపరీతంగా పెరిగాయి. ఎరువుల ధరలు రెట్టింపయ్యాయి. ఇతర ఉత్పత్తి ఖర్చులు బాగా పెరిగాయి. ప్రకృతి విపత్తులు, వరదలు, కరువులు వెంటాడాయి. దిగుబడి బాగా తగ్గింది. పండిన పంటలను మద్దతు ధరకు ప్రభుత్వం కొనే బాధ్యత తీసుకోలేదు. ఫలితంగా ప్రైవేట్ వ్యాపారస్థులకు అతి తక్కువ ధరకు రైతులు పంటలను అమ్ముకోవలసి వచ్చింది. కౌలు రైతుల పరిస్థితి వేరేగా చెప్పనవసరం లేదు. చిన్న, పేద రైతులు, కౌలు రైతులు తను పెట్టిన ఖర్చు కన్నా వచ్చే ఆదాయం తక్కువగా ఉండటం వలన అప్పులపాలౌతున్నారు. ఇలా 3,4 సంవత్సరాలు చూసిన తర్వాత అప్పు పెరిగి వ్యవసాయం గిట్టుబాటుకాక వేరే ప్రాంతాలకు, పట్టణాలకు వలస పోతున్నారు. గ్రామాలలో 5 శాతంగా వున్న భూస్వాములు, పెట్టుబడిదారీ పెద్దరైతులు ఎరువులు, పురుగు మందుల వ్యాపారాలతో, ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు నిర్వహించుకోవటం... పెట్రోలు బంకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలతో పేదల పొట్ట కొట్టి రోజురోజుకూ ఆర్థికంగా బలపడుతున్నారు. ప్రభుత్వ పథకాలన్నిటిని వీరే కాజేస్తున్నారు. గ్రామ రాజకీయాలను, కుల, మత వ్యవస్థలను తమ గుప్పిట్లో పెట్టుకుని పెత్తనం చెలాయిస్తున్నారు. దేశంలో జనాభా పెరుగుదల రేటు 1.6 శాతం ఉండగా ఆహార ధాన్యాల ఉత్పత్తి రేటు 0.7 శాతం మాత్రమే వుంది. ప్రతి సంవత్సరం 3 కోట్ల ఎకరాల్లో పంటలు ప్రకృతి విపత్తుకు గురవుతున్నాయి. రైతులకు రక్షణగా ఉంటుందన్న ప్రధానమంత్రి ఫసల్ బీమా ఒక మాయ నాటకంగా మారుతున్నది. పంటల బీమా పేరుతో కార్పొరేట్ ఇన్సూరెన్స్ కంపెనీలు వేల కోట్ల రూపాయలను మూట కట్టుకుంటున్నాయి. కానీ పంట దెబ్బతిన్న రైతులకు ఒరిగిందేమీ లేదు. గత మూడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకొని నడుపుతున్న పంటల బీమా తీరు సరేసరి. పంటలు దెబ్బతిన్న 45 లక్షల మంది రైతులకు గాను 9 లక్షల మంది రైతులకు మాత్రమే కొద్దో గొప్పో చెల్లించారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఇది కూడా లేకుండా చేతులెత్తేసి ప్రధానమంత్రి ఫసల్ బీమా లోకి చేరుతున్నట్లుగా ప్రకటించింది. ఈ కాలంలో ప్రభుత్వం మార్కెట్ వ్యవస్థ తన బాధ్యతను నెరవేర్చటం మానేసింది. గత 30 సంవత్సరాలలో వున్న ప్రభుత్వ మార్కెట్ వ్యవస్థ నాశనమైంది. సహకార వ్యవస్థలు కాగితాలకు పరిమితమయ్యాయి. ప్రభుత్వాలు ప్రకటించే మద్దతు ధరల అమలు కోసం మార్కెట్ యార్డుల దగ్గర పోరాడేందుకు అవకాశం వుండేది. అది కూడా లేకుండా చేశారు. ఎఫ్‌సిఐ ని, ప్రభుత్వ నిల్వ గిడ్డంగులను అభివృద్ధి చేసి రైతులకు అందుబాటులోకి తెచ్చే బదులు ఈ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారు. అదానీ లాంటి కార్పొరేట్ కంపెనీల గుత్తాధిపత్యానికి సర్వం సిద్ధం చేస్తున్నారు. వివిధ పంటలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు ధరలు ప్రకటిస్తున్నా ఆచరణలో అమలు లేదు. పేద, చిన్న రైతులు ప్రైవేట్ వ్యాపారస్థులు దయాదాక్షిణ్యాలకు బలికావలసి వస్తున్నది. మన రాష్ట్రంలో రైతు భరోసా కేంద్రాలే ధాన్యం మరియు ఇతర పంటలన్నిటినీ కొనుగోలు చేస్తాయని రాష్ట్రప్రభుత్వం ప్రకటించినా రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులను మిల్లర్లకు అంటగట్టి తప్పుకుంటున్నది. మిల్లర్లు అతి తక్కువ ధరకు ధాన్యం కొంటున్నారు. ఈ కాలంలో ప్రభుత్వ బ్యాంకులు పేద రైతాంగానికి రుణాలు ఇవ్వటం తగ్గిపోయింది. చిన్న రైతులు వడ్డీ వ్యాపారస్థుల పైన ఆధారపడాల్సి వస్తుంది. విద్య, వైద్యం, నిత్యావసర వస్తువుల ధరలు, ఉత్పత్తి ఖర్చులు కొండలా పెరిగిపోతున్నాయి. విదేశాల నుంచి పాలు, గోధమలు, బియ్యం, సుగంధ ద్రవ్యాలు, కాఫీ, టీ, చక్కెర లాంటి వస్తువులు కుప్పలుగా వస్తున్నాయి. ఇప్పటికే 56 దేశాలతో చేసుకున్న ద్వైపాక్షిక ఒప్పందాలు వున్నాయి. 16-ఏషియన్ దేశాలతో ఒప్పందం చేసుకోవడానికి మోడీ సిద్ధంగా ఉన్నారు. చాలా పెద్ద మొత్తంలో వచ్చి పడుతున్న విదేశీ పంటలతో, వస్తువులతో దేశీయ వ్యవసాయం కునారిల్లుతున్నది. డబ్ల్యుటిఓ ఒప్పందాలు ఎలా అమలుపరచాలా అనే గొడవ తప్పితే ఈ వ్యవసాయ సంక్షోభంలో భారత రైతులు ఎంతమంది ఆత్మహత్యలు చేసుకొంటున్నారనేది పాలక వర్గాలకు పట్టడంలేదు. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలు తమ రైతాంగానికి అవసరమైన వ్యవసాయ సబ్సిడీలు ఇచ్చి వారి పంటలను మన దేశంపైకి వదులుతున్నారు. కేరళ ప్రభుత్వం వరి ధాన్యానికి కింటాకు రూ.1000 మద్దతు ధరపై అదనంగా చెల్లించడం, రుణ మాఫీ చట్టం అమలు ద్వారా ఆ రైతాంగానికి వ్యవసాయ సంక్షోభాన్ని ఎదిరించగలిగే ధైర్యాన్నిస్తున్నది. మన వ్యవసాయాన్ని, రైతును కాపాడుకోవాలంటే స్వామినాథన్ కమిషన్ చెప్పినట్టు (సి2ం50) రైతులు పెట్టిన ఖర్చుల పైన 50 శాతం ఆదాయం వచ్చేలా కనీస మద్దతు ధర చట్టం చెయ్యాలి. లేనిపక్షంలో భారతదేశ వ్యవసాయాన్ని, రైతును కాపాడలేరు.

# సత్యవాక్కులూ కోర్టు ధిక్కారమేనా?



న్యాయకోవిదుడు ప్రశాంత్ భూషణ్‌కు వ్యతిరేకంగా పదమూడేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న కోర్టు ధిక్కారం కేసును మూసి వేయాలని సుప్రీం కోర్టు నిర్ణయించింది. ఈ ఆదేశం ఎంతో ఉపశమనం కలిగించింది. స్వాగతించాల్సిన నిర్ణయం, సందేహం లేదు. అయితే ఇదే సమయంలో నన్ను చాలా విచారం కూడా ఆవహించింది. ఒక దశాబ్దానికి పైగా ఉపేక్షించిన ఒక ముఖ్యమైన విషయంపై విచారణ జరిపేందుకు లభించిన ఒక చరిత్రాత్మక అవకాశాన్ని కూడా సుప్రీంకోర్టు జారవిడిచింది. ప్రశాంత్ భూషణ్‌పై కోర్టు ధిక్కారం కేసును మూసివేయడం వల్ల సుప్రీం కోర్టులో దాఖలైన కొన్ని ప్రమాదకర అఫిడవిట్‌లపై ఇక ఎప్పటికీ విచారణ జరిగేందుకు ఆస్కారం లేకుండా పోయింది. అవన్నీ మాజీ ప్రధాన న్యాయమూర్తుల 'అవినీతి'కి సంబంధించినవే కావడం గమనార్హం. 2020లో సుప్రీం కోర్టు ఈ కేసు విచారణను పునరుద్ధరించినప్పుడు నేను స్వాగతించాను. ఐదుగురు సీనియర్ న్యాయమూర్తుల ధర్మాసనంతో ఆ కేసుపై సమగ్ర, నిష్పాక్షిక విచారణ జరిపించాలని నేను అప్పుడు అభ్యర్థించాను. వాదనలు నివేదించేందుకు, సాక్ష్యాధారాలను నిశితంగా పరిశీలించేందుకు తగు సమయాన్ని ఇవ్వాలని కూడా నేను సూచించాను. మాజీ ప్రధానన్యాయమూర్తి ఎస్‌ఏ బాబ్డే మోటార్ బైక్ విషయమై ప్రశాంత్ భూషణ్ ట్వీట్‌లకు సంబంధించిన కేసు గురించి నేను ఇక్కడ ప్రస్తావించడం లేదు. జస్టిస్ అరుణ్ మిశ్రా తన పదవీ కాలం చివరిరోజున ప్రశాంత్ భూషణ్‌కు ఒక రూపాయి జరిమానా విధింపుతో ఆ కేసు ముగిసిపోయింది. అదే కాలంలో ప్రశాంత్ భూషణ్‌పై ఉన్న ఒక పాత కోర్టు ధిక్కారం కేసుపై విచారణను పునః ప్రారంభించాలని సుప్రీం కోర్టు హఠాత్తుగా నిర్ణయించింది. 2009లో తెహెల్కా మ్యాగజైన్‌కు ఆయన ఇచ్చిన ఇంటర్వ్యూ విషయమై ఆ కోర్టు ధిక్కారం కేసు దాఖలయింది. 'నా అభిప్రాయంలో 16 లేదా 17 మంది మంది మాజీ ప్రధాన న్యాయమూర్తులలో సగం మంది అవినీతిపరులు' అని ప్రశాంత్ భూషణ్ ఆ ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించాడు. ఈ వ్యాఖ్య ప్రశాంత్ భూషణ్, తరుణ్ తేజ్‌పాల్ (అప్పటి తెహెల్కా ఎడిటర్)పై కోర్టు ధిక్కారం కేసు దాఖలుకు దారి తీసింది. అమికస్ క్యూరీగా వ్యవహరిస్తున్న హరీశ్ సాల్వే 2009లో ఆ కేసును దాఖలు చేశాడు. అయితే ప్రశాంత్ భూషణ్ తన వ్యాఖ్యకు మద్దతుగా సమగ్ర సాక్ష్యాధారాలతో మూడు అఫిడవిట్‌లు దాఖలు చేశారు. అయితే ఆ తరువాత ఆ కేసుపై విచారణను ప్రారంభించలేదు. 2012లో ఆ కేసును విచారణ జరిపే కేసుల జాబితాలో చేర్చి కూడా విచారణను చేపట్టలేదు.. మళ్లీ 2020లో మరో కోర్టు ధిక్కారం కేసుతో పాటు దాన్ని కూడా జస్టిస్ అరుణ్ మిశ్రాకు అప్పగించారు. అది విచారణకు వచ్చినప్పుడే తరుణ్ తేజ్‌పాల్ బేషరతుగా క్షమాపణ చెప్పాడు. ప్రశాంత్ భూషణ్ ఇలా వివరణ ఇచ్చారు: '2009లో తెహెల్కాకు నేను ఇచ్చిన ఇంటర్వ్యూలో 'అవినీతి' అనే మాటను ఔచిత్యం కొరవడిన వ్యవహారం అనే అర్థంలో వాడాను. ఆర్థిక అవినీతి లేదా ఆర్థిక ప్రయోజనాలు పొందారన్న అర్థంలో నేను వాడ లేదు. నా వ్యాఖ్య సంబంధిత మాజీ ప్రధాన న్యాయమూర్తులు, వారి కుటుంబాలకు మనస్తాపం కలిగించి ఉంటే అందుకు నేను విచారిస్తున్నాను'. ఈ వివరణను తిరస్కరించి, దానిపై విచారణ జరపాలని కోర్టు నిర్ణయించింది. 'అవినీతి అనే మాటను ఉపయోగించడం కోర్టు ధిక్కారం కిందకు వస్తుందో లేదో విచారణ జరిపి నిర్ణయిస్తామ'ని కోర్టు పేర్కొంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఒకరి సంభావ్య చెడు నడవడికపై విచారణ జరిపేందుకు రాజ్యాంగపరమైన, చట్టపరమైన అనుమతి ఉన్న దేశం మనది. అయినా 'అవినీతి' అనే మాటను ప్రస్తావించడం, ఆ ఆరోపణకు గురైన వారు అందుకు పాల్పడినప్పటికీ అటువంటి మాటను పేర్కొనడం కోర్టు ధిక్కారం కిందకు వస్తుందా రాదా అనే విషయాన్ని కనుగొనాలని కోర్టు ఆకాంక్షించింది! రెండు సంవత్సరాల అనంతరం జస్టిస్ ఇందిరా బెనర్జీ, జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం ఆ కోర్టు ధిక్కారం కేసును విచారణకు చేపట్టింది. ప్రశాంత్ భూషణ్ తన వ్యాఖ్యపై వివరణ ఇచ్చారని ఆయన న్యాయవాది కామినీ జైస్వాల్ పేర్కొన్నారు. తరుణ్ తేజ్‌పాల్ బేషరతుగా క్షమాపణ చెప్పారని ఆయన న్యాయవాది కపిల్ సిబాల్ తెలిపారు. 'కోర్టు ధిక్కారం ఆరోపణ నెదుర్కొంటున్న వారు వివరణ ఇచ్చినందున, క్షమాపణ చెప్పినందున ఈ కేసుపై విచారణను కొనసాగించాల్సిన అవసరముందని వేము అభిప్రాయపడడం లేద'ని తాజా ధర్మాసనం తన ఆదేశంలో పేర్కొంది. 2009లో ప్రశాంత్ భూషణ్ సమర్పించిన అఫిడవిట్‌లు లేవనెత్తిన ప్రశ్నలు ఏమిటి? చేసిన ఆరోపణలు ఏమిటి? (వీటికి సమగ్ర సాక్ష్యాధారాలను ప్రశాంత్ భూషణ్ నివేదించారు). ఈ ప్రశ్నలు 18 మంది మాజీ ప్రధాన న్యాయమూర్తులలో ఎనిమిది మందికి సంబంధించినవి. వ్యక్తులకు కాకుండా సంస్థకు ప్రాధాన్యమిస్తున్నందున సంబంధిత న్యాయమూర్తుల పేర్లను ప్రస్తావించకుండా అఫిడవిట్‌లలోని ప్రధాన అంశాలను పేర్కొంటాను. సిజెఐ 1 : ఈయన పదవీ విరమణ అనంతరం ఒక రాజకీయ పదవిని అంగీకరించారు. తన నేతృత్వంలోని ఒక విచారణ సంఘం నివేదికలో అధికార పక్షం నేతలను తప్పుపట్టక పోయినందునే ఆయనకు ఆ రాజకీయ పదవి లభించలేదా? సిజెఐ 2 : ఈయన స్వల్పకాలం మాత్రమే భారత ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నారు. ఒక ఎగుమతుల సంస్థకు సంబంధించిన కేసులను తాను సభ్యుడుగా ఉన్న బెంచ్‌కు బదిలీ చేయించి, వాటిపై అసాధారణ ఆదేశాలు జారీ చేయలేదా? అలా కాని పక్షంలో, ఆయన పదవీ విరమణ అనంతరం సుప్రీం కోర్టు ఆ ఆదేశాలను తిరగదోడి వాటిని సమీక్షించవలసిన అవసరం ఏమిటి? సిజెఐ 3 : సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం నిర్మాణ కార్యకలాపాలు అన్నీ నిషిద్ధమైన ప్రాంతంలో ఈయన ఒక ప్లాట్‌ను కొనుక్కుని, గృహాన్ని నిర్మించుకోలేదా? ఇందుకై ఆయన ఆ ఆదేశాలను నీరు కార్చలేదా? తాను పదవిలో ఉండగా తాను నెలకొల్పిన ఒక ట్రస్ట్‌కు జీవితకాల చైర్మన్ అవడమే కాకుండా, ఆ ట్రస్ట్‌కు ఆర్థిక ప్రయోజనాలు కలిగించలేదా? సిజెఐ 4 : ఈయన ఒక ముఖ్యమంత్రిపై ఉన్న ఒక కేసును కొట్టి వేశారు. ఆ కేసును కొట్టి వేసిన రోజునే సదరు ముఖ్యమంత్రి ఈ న్యాయమూర్తి ఇద్దరు కుమార్తెలకు తన విచక్షణాధికార కోటా నుంచి రెండు నివేశన స్థలాలను కేటాయించలేదా? సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా ఈయన పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు కేసులపై విచారణ జరిపేందుకు ప్రయత్నించ లేదా? సిజెఐ 5 : ఒక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నప్పుడు ఒక వ్యక్తి నుంచి ఒక ప్లాట్‌ను పొంది, ఆ తరువాత ఒక కేసులో ఆ వ్యక్తికి అనుకూలంగా ఆదేశాలు జారీ చేయలేదా? హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నప్పుడే, ప్రభుత్వం నుంచి తక్కువ ధరకు భూమిని పొందేందుకై తప్పుడు అఫిడవిట్ సమర్పించ లేదా? సిజెఐ 6 : ప్రధాన న్యాయమూర్తి అధికార నివాసం నుంచి పని చేస్తున్న తన కుమారులకు ఆర్థిక లబ్ధి సమకూర్చలేదన్న కారణంగా ఈయన ఒక మెట్రోలో వాణిజ్య కార్యాలయాన్ని మూసివేయించలేదా? ఆ తనయులు అదే కార్యాలయం నుంచి పని చేస్తూనే షాపింగ్ మాల్స్, కమర్షియల్ కాంప్లెక్స్‌తో వాణిజ్య లావాదేవీలు కుదుర్చుకోలేదా? అంతేకాకుండా ఒక రాష్ట్ర ప్రభుత్వం వారికి వాణిజ్యపరమైన ప్లాట్‌లను కేటాయించలేదా? సిజెఐ 7 : ఈయన కుమార్తెలు, అల్లుడు, సహాయకులలో ఒకరు పెద్ద ఎత్తున స్థిరాస్తులను సమకూర్చుకోలేదా? ఈయన సుప్రీం కోర్టు న్యాయమూర్తి, ప్రధాన న్యాయమూర్తి అయిన తరువాత వారు అధికారికంగా వెల్లడించిన ఆస్తుల కంటే అత్యధికంగా ఆస్తులను సముపార్జించలేదా? సిజెఐ 8 : సుప్రీం కోర్టే నియమించిన పర్యావరణ నిపుణుల కమిటీ తీవ్రంగా తప్పు పట్టిన ఒక కంపెనీకి అత్యంత లాభదాయకమైన లీజును మంజూరు చేస్తూ ఈయన ఆదేశాలు జారీ చేయలేదా? విచారణ ప్రారంభమైన దశలో సదరు కంపెనీలో తనకు వాటాలు ఉన్నాయన్న విషయాన్ని ఆయన ఎందుకు వెల్లడించలేదు? ఈ ఆరోపణలు అంతిమ సత్యాలని నేను సూచించబోవడం లేదు. ఇవి అసత్యాలని, అంతేకాకుండా దురుద్దేశంతో చేసినవని కూడా అనుకుందాం. అయినప్పటికీ బహిరంగంగా చేసిన ఈ ఆరోపణలపై, అందునా సమగ్ర సాక్ష్యాధారాలతో అఫిడవిట్లు దాఖలు చేసినందున. దేశ సర్వోన్నత న్యాయస్థానం నిష్పాక్షిక విచారణ జరిపించవలసిన అవసరం లేదా? సిజెఐల దుర్వర్తనకు సంబంధించిన ఈ ఆరోపణలలో నిండు సత్యముందని, అయినప్పటికీ ఆ వ్యవహారాలు ఆ న్యాయమూర్తుల వృత్తిధర్మ నిర్వహణను ప్రభావితం చేయలేదని కూడా అనుకుందాం. అయినప్పటికీ ఈ ఆరోపణలపై విచారణ జరిపించి, ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి నిర్దిష్ట మార్గదర్శకాలను నిర్దేశించవలసిన అవసరం లేదా? ఈ ఆరోపణల్లో సత్యం పాలు ఎక్కువే అని భావించినప్పుడు వాటిపై విచారణ జరిపించడం న్యాయవ్యవస్థ జవాబుదారీతనానికి, సంస్కరణలకు దోహదం చేయదూ? ప్రశాంత్ భూషణ్ 2020 లోనే దాఖలు చేసిన మరొక అఫిడవిట్‌లో ఒక పెద్ద రాజ్యాంగవిహిత ప్రశ్నను లేవనెత్తారు : ఒక సత్య ప్రకటన న్యాయవ్యవస్థను అపఖ్యాతిపాలు చేస్తే అది కోర్టు ధిక్కారం అవుతుందా? ఒక సదుద్దేశంతో వ్యక్తం చేసిన విశ్వసనీయ అభిప్రాయం సత్యంగా నిరూపితమైనా, కాకపోయినా కోర్టు ధిక్కారం కిందకు వస్తుందా? ఒక దశాబ్దానికి పైగా ఎటూ తేల్చకుండా ఉండిన ఒక కేసును హఠాత్తుగా మూసివేయడం ద్వారా సుప్రీం కోర్టు ఈ క్లిష్ట ప్రశ్నలు అన్నిటికీ పాతర వేసింది. ప్రశాంత్ భూషణ్ నాకు ప్రియమైన స్నేహితుడు. అయినప్పటికీ అతనిపై ఉన్న కోర్టు ధిక్కారం కేసును సుప్రీం కోర్టు విచారణ జరపకపోవడం నన్ను ఎంతైనా నిరుత్సాహపరిచింది.

## తెలుగు నేర్వరా..?



తేనెలొలుకు తెలుగు రా
తెలుగు భాష నేర్చు రా
అందమైన తెలుగు రా
అమ్మ భాష నేర్వ రా

పల్లెటూరి తెలుగు రా
స్వచ్ఛమైన పలుకురా
సామెతలు జాతీయాలు
జానపదాలు తెలవరా

తెలుగంటే పద్యమేరా
నన్నయ్యతో మొదలు రా
పాల్కురికి తెలుగు రా
పల్లెపలుకుల కావ్యంరా

శ్రీకృష్ణ దేవరాయల కాలంరా
తెలుగు శృంగారించుకొనెరా
ప్రబంధాలు వెలిసెరా
అందలమెక్కి నిలిచెరా

అన్నమయ్య సంకీర్తనరా
అచ్చతెలుగు ఆలపించెరా
త్యాగయ్య తెలుగు రా
పరభాషీయుల మెప్పురా

కందుకూరి గురజాడ శ్రీశ్రీలు రా
చైతన్యకాంతి పుంజాలు రా
జాషువా పద్యమై వెలిగెరా
గిడుగు వ్యవహారికమై నిలిచెరా

దేశవిదేశాల్లో తెలుగు రా
అక్షరమై నిలుస్తోందిరా
తెలుగు నేలపై తెలుగు రా
నేర్చుకోమని పిలుస్తోందిరా

**- ఆవుల చక్రపాణి యాదవ్**

## నువ్వు తెగిన గాలిపటం



నువ్వు తెగిన గాలిపటం అంటావు
నేను రెక్కలు విచ్చుకొని
ఎగిరే పతంగం అంటాను
రాత్రి ఉన్నది రాత్రి కొరకే అంటావు
రాత్రి లేనిదే
పగలకు అర్థం లేదంటాను
నాకు జైలు అన్నది
నీకు అదే ఆరుబయలు
తూర్పు పడమరలు
ఎప్పుడూ అభిముఖమే!
జీవితం బహుదూరపు ప్రయాణం
కన్నీళ్లు - ఆనంద భాష్పాలు
రెండు ఒక్కటి కానట్టే
నాలుగు గోడలు ఉన్నంతనే
గది కాదు
అది ఇల్లు అసలే కాదు
అయినా
ఇప్పటికి ఇది అంతే
నువ్వు ఒక్క నువ్వే!
ఒక ఒడ్డు
ఒక పార్శ్వం
నేను మాత్రం పొంగిపొర్లిపోకుండా,
పరిగెత్తే ప్రవాహానికి
రెండు చేతుల అడ్డుకట్టను
నీతో నడిచే కాలపు చెలియల కట్టను
కలగలిసిపోయిన పాలు నీళ్లలో
ఎప్పుడో జారిపోయిన
కన్నీటి బొట్టును
నీ అంతర్గత బహిర్గత రహస్యాలు
అంతరంగంలో దాచుకొనే .... నేననేకం!

**- లోసారి సుధాకర్**

# వై.ఎస్.ఆర్ జీవితం ప్రజలకు అంకితం: ఎమ్మెల్యే గ్రంధి



భీమవరం, సెప్టెంబర్ 2 (ప్రజాపాలన ప్రతినిధి) :దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జీవితం ప్రజలకే అంకితమైందని శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ అన్నారు. స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమంకోసం సుదీర్ఘ పాదయాత్రచేసి అధికారంలోకి వచ్చిన రాజశేఖర్ రెడ్డి తొలి సంతకం రైతుల విద్యుత్ బకాయిల ఫైలుపై పెట్టి రైతులను ఆదుకున్నారని రైతులకు ఉచిత విద్యుత్ కూడా అందించి ఆదుకోవడం జరిగిందని అన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాలు సుభిక్షంగా ఉండటానికి గాను ఆనాడు 26 సాగునీటి ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపనలు చేశారని ఇందులో భాగంగానే పోలవరం ప్రాజెక్టు పనులు ఆయన చేతుల మీదుగా ప్రారంభమయ్యాయని తెలిపారు. ప్రాజెక్టుకు కుడికాలువ, ఎడమకాలువను కూడా ఆయన హాయంలోనే నిర్మించడం జరిగిందన్నారు. సామాన్య, మధ్యతరగతి వర్గానికి చెందిన విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించడానికి గాను ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. పేదవారికి మెరుగైన వైద్యాన్ని అందించేందుకు ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి కార్పొరేట్ ఆసుపత్రిలో ఉచిత వైద్యాన్ని అందించడం జరిగిందని ఇల్లు లేని ప్రతి ఒక్కరికి సొంత ఇంటి కలలను నిజం చేయడానికి ఇంటి స్థలాలను మంజూరుచేసి పట్టాలుఇచ్చి గృహ నిర్మాణాలు చేశారని గుర్తుచేశారు. ఇలా అనేక సంక్షేమ పథకాలను పేదప్రజల కోసం ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో ఆయన చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. పేదల సంక్షేమమే తన ధ్యేయంగా పాలన సాగిస్తూ రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత దురదృష్టవశాత్తు సెప్టెంబర్ రెండో తేదీన ఆయన ప్రజలను విడిచిపెట్టి వెళ్లారని తెలుగువారు ఏ రాష్ట్రంలో ఉన్నా, ఏ దేశంలో ఉన్నా రాజశేఖర్ రెడ్డిని గుండెల్లో పెట్టుకుని పదిలంగా పూజిస్తున్నారని అన్నారు. తండ్రి బాటలోనే ఆయన తనయుడు, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నేడు అనేక సంక్షేమ పథకాలను పేద ప్రజల అభివృద్ధి కోసం అన్ని వర్గాలకు మేలు జరిగే విధంగా అమలు చేస్తున్నారని తెలిపారు. ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహారాజు, ఏ ఏంసి మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, రేవూరి గోగిరాజు, కోడే యుగంధర్, తోట భోగయ్య ,జలాలుద్దీన్ బాబా, పాలవెల్లి మంగ తదితరులు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి పేదప్రజల పాలిట ఆశాదీపంగా నిలిచారని కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధికోసం ఒక లక్ష్యంతో పాలనసాగించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పేదలకు, వృద్ధులకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కామన నాగేశ్వరరావు, కొప్పర్తి వీర రాఘవులు, కొల్లి ప్రసాద్, చల్లబోయిన సూర్యప్రకాష్, కందిగట్ల ఎడ్వర్డ్, వేంద్ర విజయదుర్గ, నల్ల రత్నకుమారి, కానుబోయిన వెంకటరమణ, షేక్ రబ్బాని, పేరిచర్ల సత్యనారాయణ రాజు, చిన్నమిల్లి నాగన్న, ఏఎస్ రాజు, మానేపల్లి నాగన్నబాబు, గొట్టుముక్కల పద్మరాజు, జంగం మాణిక్యాలరావు, అల్లూరి రాజేష్ ,నందమూరి ఆంజనేయులు, బాలజ్యోతి మూర్తి, కైలా పాండు, మాదిరెడ్డి శ్రీనివాస్, చలంకి గిరి, నల్లం రాంబాబు, పెచ్చేటి ప్రసాద్, జవాది సత్తిబాబు పిప్పళ్ల నాని తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జనసేన పార్టీ అధినేత జన్మదిన వేడుకలు



అమలాపురం( ప్రజా పాలన):జనసేన పార్టీ అధినేత కొణిదల పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ సేవా ట్రస్ట్ అధ్యక్షులు మరియు చిందాడగరువు జనసేన పార్టీ ఎంపీటీసీ సభ్యులు మోటూరి కనకదుర్గ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ శెట్టిబత్తుల రాజబాబు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. మోటూరి కనకదుర్గ వెంకటేశ్వరరావు దంపతుల ధన సహాయంతో ఇమ్మివరప్పాడు వృద్ధుల ఆశ్రమం, మానసిక హరీమనోవికాన కేంద్రంలో అన్నదానకార్యక్రమంనిర్వహించారు .అమలాపురం టౌన్ బస్టాండ్ ఆవరణలో , దేవి గుడి సెంటర్ దగ్గర , గడియస్తంభం సెంటర్ దగ్గర , పేదలకు , అనాధలకు , వృద్ధులకు , మానసిక రోగులకు , దివ్యాంగులకు అన్నదాన ఆహార భోజనలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనసేన నాయకులు, చిందాడగరువు జన సైనికుడు పొణకల తాతాజీ , శెట్టిపల్లి గ్రామ జనసైనికులు , పేరూరు గ్రామ జనసైనికులు , అమలాపురం పట్టణ జనసైనికులు తదితరులు పాల్గొన్నారు

## ఎంపీ చింతా అనూరాధ కి కృతజ్ఞతలు తెలిపిన తుమ్మలపల్లి గ్రామస్తులు



అల్లవరం (ప్రజా పాలన):అల్లవరం మండలం తుమ్మలపల్లి గ్రామానికి అమలాపురం పార్లమెంట్ సభ్యులు చింతా అనురాధ చొరవతో %ాచీ+జ% వారు ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు ను మంజూరు చేయడం జరిగింది.ఈ సందర్భంగా తుమ్మలపల్లి గ్రామస్తులు ఎంపీ చింతా అనూరాధ ని మొగల్లమూరులోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు ను మంజూరు చేయించినందుకు కృతజ్ఞతలు తెలియజేసి, సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పులుసుగంటి రాజేశ్వరి, చింతా రాధ కృష్ణ, పెమ్మడి శ్రీను, కాట్రు శాంతి కిరణ్, పాలమూరు వెంకన్న, చెల్లి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు

## పేరూరు గ్రామంలో మహానేత కు ఘన నివాళులు అర్పించిన నాయకులు



అమలాపురం (ప్రజాపాలన) :అమలాపురం రూరల్ మండలం పేరూరు గ్రామంలో మహానేత దివాంగత డాక్టర్ వై యస్ రాజశేఖరరెడ్డి 13వవర్ధంతి కార్యక్రమం జరిగింది. పేరూరుసర్పంచ్ దాసరి అరుణ డేవిడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా శాఖమాత్యులు పినిపే విశ్వరూప్ ముఖ్య అతిథిగా పాల్గొని డాక్టర్ వై యస్ రాజశేఖరరెడ్డి విగ్రహనుకి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు సర్పంచ్ దాసరి అరుణ డేవిడ్ వేసి ఘన నివాళులు అర్పించారు ఈకార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ నృత్య కళా చైర్మన్ కూడుపూడి సత్య శైలజ,ఉప సర్పంచ్ కూడుపూడి సత్యనారాయణ,జడ్పీటీసీ పందిరి శ్రీహరి, వైస్సార్సీపీ మండల అధ్యక్షులు బొంతు గోవింద్ శెట్టి, ఎంపీటీసీ చోళ్లంగి సుబ్బురామ్, ఇళ్ల ఏడుకొండలు వార్డ్ సభ్యులు దేగల వెంకన్నబాబు, మాజీ ఎంపీటీసీ దాసరి డేవిడ్, వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జగన్ రెడ్డి సర్కార్ పతనానికి ఉద్యోగులపై ఉక్కు పాదం..



పల్నాడు జిల్లా: నరసరావుపేట. సెప్టెంబర్ 2( ప్రజా పాలన ప్రతినిధి): ఎన్నికల ముందు వారంలో సిపిఎస్ రద్దు చేస్తానని ఉద్యోగులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలంటూ శాంతియుత మార్గంలో ఉద్యోగులు ఉద్యమం చేస్తుంటే హామీని నెరవేర్చకుండా ఉద్యోగులపై ఉక్కుపాదం మోగుతూ ఉద్యోగ సంఘాల నేతలపై ఉద్యోగులపై అక్రమ కేసులు పెట్టించి బైండోవర్లు చేయడానికి ఖండిస్తుందని ప్రభుత్వం వెంటనే ఉద్యోగులపై సంఘ నాయకుల పై పెట్టిన కేసులను ఎత్తివేయాలని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు జీవీ ఆంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిపిఎస్ ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలుపరచాలని ఉద్యోగులు ఉద్యోగ సంఘాల నాయకులు ఉద్యోగం చేస్తుంటే ప్రభుత్వం ఉద్యోగుల పట్ల అన్యాయంగా వ్యవహరిస్తుందన్నారు. వారు రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తారని నాటు ప్రకటించిన జగన్ రెడ్డి నాలుగేళ్లు గడిస్తున్న హామీ నెరవేర్చుకోపోగా ఉద్యోగులపై ఫ్యాక్షనిస్టుగా సీఎం వ్యవహరించడం దుర్మార్గమన్నారు. శాంతియుతంగా నిరసనలు చేపడుతున్న ఉద్యోగుల హక్కులను హరించడం నియంతృత్వ పోకడేనని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 99% ఉద్యోగులపై బైండవులు ముందస్తు నిర్బంధాలు అక్రమ అరెస్టు చేయడం చట్ట విరుద్ధమన్నారు. నిరసనను వాయిదా వేసుకున్న పోలీసులు మాత్రం ఉద్యోగులను వదలకుండా స్కూళ్లల్లో చొరబడి భయంకపితులను చేయటం అత్యంత దారుణం అన్నారు. అడ్డగోలు హామీలు ఇచ్చిన జగన్ రెడ్డి అడ్డదారులు అధికారంలోకి వచ్చి హామీలు నిలబెట్టుకోమని డిమాండ్ చేస్తే ఉద్యోగుల దేశద్రోహులుగా చిత్రీకరించి ఉక్కు పాదం మోపడం క్షమించరాని దుర్మార్గమన్నారు. కొంతమంది పోలీసులు వింత పోకడను ప్రదర్శిస్తున్నారని, వైకాపా యూనిఫాం వదిలి ఖాకీలు ప్రజల భద్రత కోసం పనిచేయకుంటే భవిష్యత్తులో ప్రజా తిరుగుబాటు చవిచూస్తారని హితవ్ పలికారు. సిపిఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యమంలో పాల్గొంటున్న ఉద్యోగ సంఘాల నేతలు, ఉద్యోగ కుటుంబాలని బెదిరించే స్థితికి జగన్ రెడ్డి రాష్ట్ర లో దిగజారాడని విమర్శించారు. అడ్డగోలు హామీలు ఇచ్చి నెరవేర్చుకోలేని జగన్ రెడ్డినీ ప్రజలు ఛీ కొడుతున్నారని, ప్రజా భద్రత కోసం పనిచేయకుంటే తిరగబడే రోజులు వస్తాయని అన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకు రాష్ట్ర జరుగుతున్న శాంతియుత ఉద్యమానికి టిడిపి నుండి సంపూర్ణ మద్దతు ఉంటుందని, ఈ పాలనలో ప్రజలు ఆయా గ్రామాల్లో బతికే పరిస్థితి లేదని, గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రజలు వలస పోతున్నట్టు తెలిపారు. సమావేశంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## మరణం లేని మహా నాయకుడు వైఎస్సార్

**ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి**



పల్నాడు జిల్లా నరసరావుపేట సెప్టెంబర్ 2 ప్రజాపాలన ప్రతినిధి: మరణం లేని మహా నేత.. పేదవాడి గుండెల్లో కొలువైన దేవుడు వైఎస్సార్ ని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కొనియాడారు. దివంగత మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర రెడ్డి 13వ వర్ధంతి సందర్భంగా నరసరావుపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే అదేర్యంలో ఘన నివాళి అర్పించారు. ప్రకాశ్ నగర్ పార్టీ కార్యాలయంలో వైఎస్ఆర్ విగ్రహానికి ఎంపీపీలు, జెడ్పీటీసీ, మార్కెట్ యార్డ్ చైర్మన్లు, సర్పంచ్లు, ఎంపీటీసీలు, కార్పోరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, వైసిపి నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం రామిరెడ్డిపేట పాత సమితి ఆఫీస్ వద్ద గల వైఎస్ఆర్ విగ్రహానికి ప్తన్నంలోని ప్రముఖ డాక్టర్లతో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సత్తెనపల్లి రోడ్ లోని బీసీ కాలనీ, చంద్రబాబు నాయుడు కాలనీ, మిట్టబజార్, పెద్ద చెరువులో గల 31,25,26 వార్డుల్లో గల వైఎస్ఆర్ గారి విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి తో కలిసి పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.అనంతరం జొన్నలగడ్డ- రంగారెడ్డి పాలెం మధ్యలో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ విగ్రహాన్ని గౌరవ రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి , ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం రంగారెడ్డి పాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన కాజ్ వే ను ప్రారంభించారు. ఆర్టీసి యూనియన్ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డ్ లో, షాలెం నగర్, ప్రకాష్ నగర్, రిక్షా సెంటర్ ఎల్లో వైఎస్సార్ గారి విగ్రహాన్ని పూలమాల వేసి నివాళులర్పించారు. వికలాంగులకు వీల్ చైర్ పంపిణీ చేసి.. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. రొంపిచర్ల మండల కేంద్రంలోని బీసీ కాలనీలో వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్ చూపిన బాటలో.. జగనన్నతో కలిసి అడుగులేస్తూ.. ఆయన ఆశయ సాధన దిశగా ముందుకు సాగుతామని అన్నారు. 108, ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్మెంట్, జలయజ్ఞం తో రూపుదిద్దుకున్న ప్రాజెక్టులు ఇలా ప్రతి చోట వైఎస్సార్ ఉన్నారన్నారు. మరణం లేని మహా నాయకుడు.. పేదవాడి గుండెల్లో కొలువైన దేవుడు వైఎస్సార్ అని అన్నారు.ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు మాట్లాడుతూ... పేదల పెన్నిదిగా రాజశేఖర్ రెడ్డి గారు వెలుగొందారని, ఆయన ప్రవేశ పెట్టిన పథకాలు, అందించిన పరిపాలనతో అందరి మనసుల్లో ఎప్పటికీ స్థిర స్తాయిగా నిలిచిపోతారని తెలిపారు.అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ... వైఎస్ఆర్ పేదల మనిషి అని.. పేదవారికి కష్టం వస్తే చలించిపోమే చల్లని మనసున్న మారాజు అని కొనియాడారు. ఈ రోజు ఆయన ఎక్కడికీ పోలేదని.. పండే పంటలో, కురిసే వర్షంలో, వీచే గాలిలో.. ప్రతి చోట వైఎస్సార్ ఉన్నారు అని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందుతున్నాయి...

**ప్రజలు సంతోషంగాఉన్నారు:ఎమ్మెల్యే గోపిరెడ్డిశ్రీనివాస్ రెడ్డి**



నరసరావుపేట సెప్టెంబర్ 2 ప్రజా పాలన ప్రతినిధి: ప్రతి గడపలో సంతోషం ఉందని ప్రతి గడపగడపకు సంక్షేమ పథకం పథకాలు అందుతున్నాయని ప్రజలు సంతోషంగా ఉన్నారని నరసరావుపేట శాసనసభ్యులు గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. 27వ వార్డ్ లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి . ముఖ్యమంత్రి వర్యులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశానుసారం నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి నరసరావుపేట పట్టణంలోని 27వ వార్డ్ లో గురువారం సాయంత్రం పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కి వార్డ్ వాసులు ఘన స్వాగతం పలికారు. మాజీ కౌన్సిలర్ గోగుల శంకరమ్మ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన సెక్రెటరీ గోగుల మనోహర్ యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. వార్డ్ లోని ఆంజనేయ స్వామి దేవాలయం, శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తమ ఇంటికి వచ్చిన అభిమాన నేతపై పూల వర్షం కురిపించి తమ ప్రేమను తెలియజేశారు. మూడేళ్ల జగనన్న పాలనలో జరిగిన మేలును ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిక్షణం ప్రజల పక్షాన నిలబడి సంక్షేమ పథకాలను అందిస్తున్నామని ప్రతి గడపలో సంతోషం కనిపిస్తుందని అన్నారు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమం ఒకవైపు అభివృద్ధి ఒకవైపు చేస్తున్నారని దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్ లో ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్ జగన్ కే దక్కుతుందని అన్నారు. 27వ వార్డులో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు మాజీ కౌన్సిలర్ శంకరమ్మ సారథ్యంలో వార్డును చాలా అభివృద్ధిపరిచామని అన్నారు ఇప్పటికైనా తెలుగుదేశం పార్టీ చేస్తున్న ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దని రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమానికే మొదటి అడుగు వేసిందని అన్నారు ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పుట్టినరోజు పురస్కరించుకుని పదివేల ఆర్థిక సాయం చేసిన సర్పంచ్ పోణకల గణేష్



అమలాపురం రూరల్ మండలం తాండవపల్లి గ్రామానికి చెందిన ఆచంట పండుకి చిందాడగరువు గ్రామ సర్పంచ్ పొణకల గణేష్ పుట్టినరోజు సందర్భంగా తన స్నేహితులతో కలిసి 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు . ఈ సందర్భంగా సర్పంచ్ పొణకల గణేష్ మాట్లాడుతూ మా మిత్రుడు ఆచంట పండు అనారోగ్యంతో బాధపడటంతో పుట్టినరోజు సందర్భంగా పదివేలు రూపాయలు ఆర్థిక సాయం అందజేశానని ఆపదలో ఉన్నవారికి ప్రతి ఒక్కరు అండగా నిలవాలని అయిన కోరారు.ఆర్థిక సాయం అందజేసిన సర్పంచ్ ను పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో కైరం రాము, కొలిశెట్టి నాగబాబు, పిల్లా రమేష్, నక్కా సతీష్, పొణకల కుమార్ తదితరులుపాల్గొన్నారు.

## జనసేన పార్టీ ఆధ్వర్యంలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు వేడుకలు



కారంపూడి.. సెప్టెంబర్02.. ప్రజాపాలన... ప్రతినిధి:మండలంలోని పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు సందర్భంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో వీర్ల గుడి ఆవరణలో మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన మండల జనసేన పార్టీ నాయకులు సుమారు 50 మంది జనసైనికులు రక్తదానం చేశారు అనంతరం జన సైనికులు కేక్ కట్ చేసి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ పుట్టినరోజులు శుభాకాంక్షలు తెలియజేశారు అనంతరం వారు మాట్లాడుతూ రక్తదానం అంటే ప్రతి ఒక్కరికి మేలు చేసి కార్యక్రమం కాబట్టి ఈ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించామని వారు అన్నారు రక్తదానం చేయండి ప్రాణాలను కాపాడండి అనే నినాదాన్ని జనసేన పార్టీ నాయకులు జన సైనికులు రక్తదానం చేయడంలో ఎప్పుడు ముందుంటామని వారు అన్నారు ఈ కార్యక్రమంలో మండల జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు



నరసాపురం, సెప్టెంబర్ 2 (ప్రజాపాలన ప్రతినిధి) : జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలను జనసేన పార్టీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుక్రవారం పట్టణంలోని నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో మరియు నియోజకవర్గంలోని పలు గ్రామాలలో అత్యంత వేడుకగా నిర్వహించారు. ఈ పుట్టినరోజు వేడుకలలో నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్, రాష్ట్ర పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యులు, రాష్ట్ర మత్స్యకారవికాస విభాగ ఛైర్మెన్ బొమ్మిడి నాయకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని పార్టీ నాయకులు, కార్యకర్తలతో నియోజకవర్గంలోని పలు గ్రామాలలో భారీ ర్యాలీ నిర్వహించి కేకులు కట్ చేసి పార్టీ నేతలకు, కార్యకర్తలకు తినిపించారు. అధినేత పవన్ కళ్యాణ్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. పవన్ కళ్యాణ్ జన్మదిన కార్యక్రమాల్లో భాగంగా పార్టీ నేతల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం వంటి పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమాలలో జనసేన పార్టీ పట్టణ మండల అధ్యక్షులు, పార్టీ కౌన్సిలర్లు, జిల్లా నాయకులు, బూత్ కమిటీల అధ్యక్షులు, పంచాయితీ ప్రెసిడెంటులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, కార్యకర్తలు, వీర మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## రొయ్యల ఎగుమతులపై అధికంగా దృష్టి సారించిన వాటర్‌బేస్



నెల్లూరు,ప్రజాపాలన ప్రతినిధి : : ఆక్వాకల్చర్ రంగంలో అగ్రగామి సంస్థలలో ఒకటి కావడంతో పాటుగా 29 సంవత్సరాల మహోన్నత వారసత్వం కలిగిన వాటర్‌బేస్ లిమిటెడ్ (టీడబ్ల్యుఎల్), తమ రొయ్యల ప్రాసెసింగ్ కేంద్రాన్ని పునరుద్ధరించడంతో పాటుగా ఆధునీకరించింది. ఈ ప్లాంట్‌లో ఈ ప్లాంట్‌లో అత్యాధునిక ప్లేట్ ఫ్రీజర్లు, ఐక్యుఎఫ్, గ్రేడింగ్ మెషీన్, కన్వేయర్లు, కండెన్సర్లు, ఇతర ప్రాసెసింగ్ ఎక్విప్‌మెంట్ ఉండటం చేత వేగవంతంగా కార్యకలాపాలను నిర్వహిస్తూనే అత్యున్నత నాణ్యత ప్రమాణాలకు భరోసా అందిస్తుంది. ఈ ప్లాంట్ ఆధునీకరణతో సంవత్సరానికి ఐదువేల మెట్రిక్ టన్నుల రొయ్యలను ప్రాసెస్ చేయగలదు. ఈ కంపెనీ, విస్తృత శ్రేణిలో ప్రాసెస్ చేసిన రొయ్యలను ఈ ప్లాంట్ ద్వారా అందిస్తుంది. వీటిలో హెడ్ ఆన్, హెడ్‌లెస్, ఈజీ పీల్, పీడీ, పీడీటీఓ, పీయుడీ, పీయుడీ టైల్‌ను ఒక బ్లాక్ లో, ఐక్యుఎఫ్ ఫార్మ్స్‌లో అందిస్తుంది. ఈ యూనిట్‌ను ఈయు, యుఎస్ఎఫ్‌డీఏ, హెచ్ఏసీసీపీ, ఎఫ్ఎస్ఎస్ఏఐ, ఇతర అంతర్జాతీయ ప్రమాణాలకనుగుణంగా కార్యకలాపాలు నిర్వహించేలా తీర్చిదిద్దామని ద వాటర్‌బేస్ లిమిటెడ్ సీఈఓ రమాకాంత్ ఆకుల తెలిపారు.

## సకాలంలో ప్రజలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యం కూడా అందించలేని రాష్ట్ర ప్రభుత్వం ,డోర్ డెలివరీ అన్నారు

సత్తెనపల్లి ప్రజాపాలన :కనీసము మాములు డెలివరీ కూడా చెయ్యలేని రాష్ట్ర ప్రభుత్వం మరీ ఇటీవల కాలంలో పూర్తిగా వైఫల్యం చెందింది.... సత్తెనపల్లి పట్టణ బీజేపీ నాయకుల ఆరోపణలు..... ఈ రోజు అనగా ది 22.04.22 తేదీ, శుక్రవారం ఉదయం11.30 సత్తెనపల్లి పట్టణ బీజేపీ అధ్యక్షుడు దివ్వెల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తాడువాయి రాములు భవన్ లో ఈ ప్రెస్ నోట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా సత్తెనపల్లి పట్టణ బీజేపీ అధ్యక్షుడు దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఆర్భాటపు ప్రకటనలు వృధా ఖర్చులు చేసి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయడం తప్పా ఆచరణలో సాధించిది శూన్యం అని దుయ్యబట్టారు. అంతేకాకుండా ప్రజా పంపిణీ వ్యవస్థలో పెనుమార్పులు తీసుకొచ్చాము అని అన్నారు,అదేమిటంటే ఈ వ్యవస్థ ద్వారా ఇచ్చే వస్తువులు లబ్ధిదారులకు డోర్ డెలివరీ అనగానే ప్రజలు సంతోషపడ్డారు తీరా ఆచరణలో ప్రజలకు అర్థం అయ్యింది ఏమిటంటే వాహనాల యొక్క డోర్ దగ్గరకు లబ్ధిదారులు రావాలి అని ,ఇది గమనించిన ప్రజలు దీన్ని చూసి పెదవి విరిచారు ,ఈ భాగ్యానికేనా ఇన్ని కోట్లు వెచ్చించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసింది అని అన్నారు,అంతేకాకుండా గతంలో చక్కగా సమయానికి వెళ్ళి ఈ పంపిణీ వ్యవస్థలో సరుకుల తెచ్చుకోన్నవారికి వీరి అనాలోచిత నిర్ణయం వల్ల మేలు జరగకపోగా ఇటీవల సరిఅయిన సమయంలో పంపిణీ జరగడం లేదు అని బీజేపీ నాయకులు విమర్శించారు. ఇదే కాకుండా అనేక రంగాల్లో ఇంత వైఫల్యం చెందిన ప్రభుత్వాన్ని మునుపెన్నడూ చూడలేదు అని అన్నారు.వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పంపిణి వ్యవస్థ ను మెరుగుపరచి నిరుపేదల ఆకలి సకాలంలో తీర్చాలి అని బీజేపీ ద్వారా డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు.శ్రీ పగడాల సాంబశివరావు, శ్రీ కట్టా శంకరరావు, శ్రీ మక్కెన వేణు,శ్రీ చలువాది హరికుమార్ ,శ్రీ వెపూరి వెంకటేశ్వర్లు,శ్రీ మందపాటి శ్రీనివాసరావు, శ్రీ మురారిశెట్టి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సేవే పరమావధిగా పార్టీ స్థాపించిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్





గుడివాడ, ప్రజాపాలన ప్రతినిధి సెప్టెంబర్ 02: పవన్ కళ్యాణ్ పుట్టినరోజులు పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని జనసేన నాయకులు ఆర్కే అన్నారు.జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను గుడివాడ పట్టణ జనసేన నాయకుడు ఆర్కే ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మదర్ తెరిసా, డొక్కా సీతమ్మ వంటి వారిని ఆదర్శంగా తీసుకొని నిస్వార్థంగా ప్రజలకు సేవలు అందిస్తున్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకొని జన సైనికులు అందరూ పట్టణవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అనంతరం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని విఙ్ఞేశ్వర స్వామికి ఆర్కే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు పాలంకి సారథి, సందు పవన్, పార్టీ జిల్లా కార్యదర్శి పేర్ని జగన్, నాయకులు అయ్యప్ప, కరీం, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

# అరవిందుడు .... అందరివాడా..? కొందరి వాడా..?



పల్నాడు జిల్లా. నరసరావుపేట. సెప్టెంబర్ 2 (ప్రజా పాలన ప్రతినిధి. )నరసరావుపేటలో తెలుగుదేశం పార్టీలో మరోసారి కుమ్ములాటలు ప్రారంభయ్యాయి. ముగ్గురు నాయకులు మూడు గ్రూపులు, నాయకులు కార్యకర్తల కు అర్థం కాని పరిస్థితిలో నరసరావుపేట తెలుగుదేశం పార్టీ ఉంది . అధిష్టానానికి తెలుసా తెలియదా కార్యకర్తల్లో ప్రశ్నార్థంగా మారింది. గత కొంతకాలంగా నరసరావుపేట తెలుగుదేశం పార్టీ నాయకులలో విభేదాలు చాప కింద నీరులా ప్రారంభమై నువ్వా నేనా అన్నట్లుగా మారిపోయింది. పబ్లిక్ గా మూడు కుంపట్లుగా తెలుగుదేశం పార్టీ తయారయింది. నియోజకవర్గం వైపు చంద్రబాబు గాని లోకేష్ గాని చూడటం లేదా అనేది ప్రశ్న . గతంలో కోడెల శివప్రసాద్ సత్తెనపల్లి కి వెళ్లిన దగ్గర నుండి డాక్టర్ డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు 2013లో రాజకీయాల్లోకి వచ్చి తనదైన స్టైల్ లో ప్రజా సమస్యలపై పోరాడుతూ తమ నాయకత్వాన్ని గుర్తింపు తెచ్చుకున్నాడు. ఈ క్రమంలో తెలుగుదేశం పార్టీలోనే ఒక సామాజిక వర్గం చదలవాడకు సపోర్ట్ చేస్తున్నారా లేదా అనేది కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. ఎన్నో సమస్యలు ఎదురైనా ప్రజల మధ్యలో ఉండి పోరాడుతూ పార్టీని బ్రతికిస్తున్నాడు అరవింద బాబు. అలాంటిది ఒక బీసీ నాయకత్వంలో పనిచేయక పోవడం కారణమేమిటి ఓసీలకు సీట్ వస్తే అందరూ పార్టీ కోసం పని చేయాలా అదే ఒక బీసీ నాయకునికి సీటు వస్తే పనిచేయరా ఆ నాయకుని గెలిపించుకోరా బీసీలకు సీటు వస్తే ఎందుకు ఆ వర్గం వెనుకడుగు వేస్తుందో ప్రజలకు అర్థం కావడం లేదు. అధిష్టానం లోపమా లేక నాయకుల్లోపు తెలియని పరిస్థితి. కోట్ల రూపాయల ఖర్చు చేస్తూ 2013 నుండి రాజకీయాల్లోకి వచ్చి ఒకసారి అసెంబ్లీకి పోటీ చేసే మరల 2024లో గట్టి పోటీ ఇచ్చి గెలవాలని ఉద్దేశంతో అరవింద్ బాబు ప్రయత్నం చేస్తుంటే తెలుగుదేశంలో మూడు కుంపట్లు ఏర్పడటం ఇబ్బందికరంగానే ఉంది. పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు నరసరావుపేట నియోజకవర్గం లో ఉన్న గ్రూపు నాయకులను ఒకచోట కూర్చోబెట్టి సమన్వయం, చేయలేకపోతున్నారా అనేది ప్రశ్నార్థంగా మారింది. ఒక తాటిపై తీసుకురాకపోవడంతో నాయకు లు, కార్యకర్తలు కొంతమంది సహ నం కోల్పోయి పార్టీకి దూరమవుతు న్నారు. ముగ్గురు నాయకులు, మూడు పార్టీ కార్యాలయాలు తెలుగుదేశం పార్టీలో సందడిగానే ఉంది. మూడు పూలు ఆరు కాయలు లాగా తెలుగుదేశం పార్టీ ఉంది . అధిష్టానం ఎందుకు చర్యలు తీసుకోలేకపోతుందో అర్థం కాని ప్రశ్న. ఇటీవల మంగళగిరి సీనియర్ నాయకులు తెలుగుదేశం పార్టీ నుంచి వీడి వైఎస్ఆర్సిపి లో చేరిన సంగతి అందరికీ తెలిసింది అతను కూడా ఒక బీసీ నాయకుడే. తెలుగుదేశం పార్టీలో బీసీలకు స్థానం ఉంటుందా లేదా అనేది ప్రశ్నార్థకం . వైద్య వృత్తిలో మంచి పేరు తెచ్చుకొని పలనాడు జిల్లాలోని మంచి పేరు తెచ్చుకున్న డాక్టర్. డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు . డాక్టర్ ని రాజకీయాల్లోకి దింపి అతన్ని ఇబ్బంది పెట్టడం సరికాదని నాయకులు కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. గత పది సంవత్సరాలుగా పేద ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో డాక్టర్ చదలవాడ ప్రజాసేవ లోకి అడుగు పెట్టాడు. ఒక సైనికుడిలా ప్రజా సమస్యలపై పోరాడుతూ నియోజక వర్గంలోని ప్రతి గ్రామానికి వెళ్తూ బాదుడే బాదుడు అనే కార్యక్రమా నికి శ్రీకారం చుట్టి ప్రజల సమ స్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తూ రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. అలాంటి నాయకుడిని ఈరోజు తెలుగుదేశం పార్టీలో ఒక సామాజిక వర్గం పక్కన పెడుతుందంటే కొంత ఆశ్చర్యం కలిగిస్తుంది. ప్రతిక్షణం ప్రజల సమస్యలపై పోరాడుతూ ప్రజల మధ్యలో ఉంటూ ఎన్నో ఆటుపోట్లు ఎదురైన ధైర్యంతో ముందుకు నడుస్తూ మంచి నాయకుడిగా పేరు తెచ్చుకుంటున్న అరవింద బాబుకు రానున్న 20 24 ఎన్నికలలో సీటు వస్తుందా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా అధిష్టానం దృష్టి పెట్టాలని కార్యకర్తలు కోరుచున్నారు.

## భవన నిర్మాణాలను వేగవంతం చేయాలి



భీమవరం, సెప్టెంబర్ 2 (ప్రజాపాలన ప్రతినిధి) :గ్రామ సచివాలయాలు, ఆర్బికే, వై.ఎస్.ఆర్ హెల్త్ క్లినిక్ లు, డిజిటల్ లైబ్రరీలు, బిఎంసియు, ఏఎంసియులు నాడు.– నేడులో చేపట్టిన భవనాల నిర్మాణపనులు త్వరితగతిన పూర్తిచేయాలనీ జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరు కార్యాలయం నుండి మండలస్థాయి అధికారులతో శుక్రవారం నాడు – నేడులో చేపట్టిన భవనాల నిర్మాణ పనులపై మండల అధికారులు, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో జిల్లా కలెక్టరు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ పేదకుటుంబం గుమ్మం వద్దకు పాలనను తీసుకువెళ్లేందుకు గ్రామసచివాలయ వ్యవస్థను ఏర్పాటుచేసిందని రైతులకు అవసరమైన సేవలను వారి వద్దకే అందించేందుకు రైతు భరోసా కేంద్రాలను, ఫ్యామిలీ ఫీజిషియన్ విధానంద్వారా ప్రతీ పేదఇంటి వద్దకే వైద్య సేవలందిస్తున్నదని తెలిపారు. వీటికి సంబంధించిన భవనాల నిర్మాణాలను వేగవంతంచేసి అక్టోబరు నెలాఖరు నాటికి నూరుశాతం పూర్తిచేసే లక్ష్యంతో అధికారులు, సిబ్బంది పనిచేయాలన్నారు. గ్రామ సచివాలయాలు, ఆర్బికే, వై.ఎస్.ఆర్. హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణాలకు సంబంధించి కోర్టులలో పెండింగులో ఉన్న కేసులు మినహా, ఇంకా పనులు ప్రారంభించని భవనాల నిర్మాణపనులను ఈనెల 15వ తేదీలోగా బేస్మెంట్ స్థాయికి పూర్తి చేయవలసిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. పూర్తయిన భవనాలు ప్రారంభించాలని ఆదేశించారు. ఈ విషయంలో అలసత్వానికి ఎటువంటి తావులేకుండా చూడాలని అధికారులు, సిబ్బందిని ఇప్పటికే పలుమార్లు హెచ్చరించినప్పటికీ పనులలో పురోగతిలేదని ఇప్పటికైనా అధికారులు, సిబ్బంది మెరుగైన పనితీరు కనపరచి నిర్దేశించిన లక్ష్యాలసాధనకు కృషి చేయాలనీ అలక్ష్యం వహించే వారిపై తీవ్రస్థాయిలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హెచ్చరించారు. భవన నిర్మాణాల స్థలాలకు సంబంధించి కోర్ట్ లో కేసులు ఉన్న అంశాలలో కొన్ని భవన నిర్మాణాల కోసం ప్రత్యామ్నాయ స్థలాలకోసం పంపిన ప్రతిపాదనలకు ఆమోదం ఉత్తర్వులు జారీచేయడం జరిగిందని వాటికి సంబంధించి కూడా నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ఫినిషింగ్ స్థాయిలో ఉన్న భవనాలు పూర్తిచేయాలని కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పంచాయతీ రాజ్ సూపరింటెండెంగ్ ఇంజనీరు కె. శ్రీనివాసరావు, డిసిఓ రవికుమార్, డ్వామా పి.డి రాజేశ్వరరావు, మండల అభివృద్ధి అధికారులు, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## మంగళగిరిలో జరిగే టీడీపీ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశాలకు లోకేష్



గుడివాడ, ప్రజాపాలన ప్రతినిధి సెప్టెంబర్ 02: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కు హైదరాబాద్ ఎయిర్పోర్ట్ లో స్వాగతం పలుకుతున్న ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శిష్టా లోహిత్ కార్యకర్తల సంక్షేమంపై తీసుకుంటున్న చర్యలను నారా లోకేష్ కు వివరిస్తున్న శిష్టా లోహిత్ హైదరాబాద్ ఎయిర్పోర్ట్ లో నారా లోకేష్ కు ఘనస్వాగతం పలికిన శిష్టా లోహిత్‌లి కార్యకర్తల సంక్షేమంపై తీసుకుంటున్న చర్యలపై సమీక్షహైదరాబాద్, సెప్టెంబరు 2: మంగళగిరిలో జరిగే టీడీపీ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశాల్లో పాల్గొనేందుకు హైదరాబాద్ ఎయిర్పోర్ట్ కు చేరుకున్న తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కు ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కార్యకర్తల సంక్షేమ నిధి కోఆర్డినేటర్ శిష్టా లోహిత్ ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇరువురు నేతల మధ్య కొద్దిసేపు పార్టీ వ్యవహారాలపై చర్చ జరిగింది. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలపై నారా లోకేష్ సమీక్షించారు. పార్టీ కార్యకర్తల ఆరోగ్యం, ఉపాధికి సంబంధించి ర్యాపిడో, న్యూట్రిఫుల్ యాప్ లపై అవగాహన కల్పిస్తున్నట్టు శిష్టా లోహిత్ చెప్పారు. కార్యకర్తలు ఆరోగ్యంగా ఉంటేనే తెలుగుదేశం పార్టీ పటిష్ఠంగా ఉంటుందన్న అభిప్రాయాన్ని నారా లోకేష్ వ్యక్తం చేశారు. న్యూట్రిఫుల్ యాప్ ద్వారా డయాబెటిస్, బరువు, థైరాయిడ్ వంటి సమస్యలకు ప్రముఖ వైద్యులచే సలహాలు, సూచనలను అందించడం జరుగుతోందని శిష్టా లోహిత్ వివరించారు. ర్యాపిడో యాప్ ను ప్రతి ఒక్కరూ డౌన్లోడ్ చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. క్యాడర్ వెల్ఫేర్ 2.0 కార్యక్రమం ద్వారా యువతను మరింత ప్రోత్సహిస్తున్నామని నారా లోకేష్ తెలిపారు. కార్యకర్తల సంక్షేమానికి సంబంధించి తెలుగుదేశం పార్టీ అమలు చేస్తున్న కార్యక్రమాలు పూర్తిస్థాయిలో సద్వినియోగమయ్యేలా చూడాలని శిష్టా లోహిత్ ను నారా లోకేష్ ఆదేశించారు.

## పాత గోకొనకొండలో జనసేన పార్టీ అధ్యక్షుడు కొణిదల పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు



వినుకొండ సెప్టెంబర్ 02 (ప్రజాపాలన ప్రతినిధి) :జనసేన పార్టీ అధ్యక్షుడు అయినటువంటి కొణిదల పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా పాత గోకొనకొండ గ్రామంలో మొక్కలు నాటడం ,స్థానికంగా ఉన్న ప్రభుత్వ స్కూళ్లలో స్వీట్లు పంచటం జరిగింది ,ఈ కార్యక్రమానికి గుంటూరు జిల్లా కార్యదర్శి మరియు వినుకొండ నియోజవర్గ ఇంచార్జ్ ని శంకరరావు శ్రీనివాసరావు ,జిల్లా లీగల్ సేల్ ప్రధాన కార్యదర్శి లాయర్ నక్క రమణారావు , జిల్లా కార్యనిర్వహణ సభ్యులు శివాజీ చిరంజీవి, యాదాల వెంకటేష్ ,మరియు వినుకొండ పట్టణ అధ్యక్షుడు అయినటువంటి యూసుఫ్ పటాన్ నూజెండ్ల మండల కార్యదర్శి రాజబాబు మరియు గోకనకొండ జనసేన పార్టీ కార్యకర్తలు అభిమానులు అందరు పాల్గొనడం జరిగినది.

## ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు



వీరులపాడు సెప్టెంబర్ 2 ప్రజా పాలన ప్రతినిధి:జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు మండల పరిధిలోని అనేక గ్రామాల్లో ఘనంగా వారి అభిమానులు పార్టీ కార్యకర్తలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో భాగంగా మండల పార్టీ అధ్యక్షులు బేత పూడి జయరాజు ఆధ్వర్యంలో వేడుకలను బోడ వాడ – జమ్మవరం గ్రామం లో ఘనంగా నిర్వహించారు. అర్ధరాత్రి కేక్ కట్ చేసి కార్యకర్తలకు గ్రామ ప్రజల కు అందజేశారు. బాణా సంచా పెద్ద ఎత్తున కాల్చి సంబ రాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యక ర్తలు ఖాసీం, గుంటీ వీరయ్య, మెండెం రాజు, వీర్ల రమేష్,దొప్పల అనీల్,సంగం రాజు,బేతపూడి ప్రభు,వంశీ, మరియథాసు,గుజ్జర్లపూడి కళ్యాణ్, మెరుగుమల గోపి, రవిచంద్ర పలువురు కార్యకర్తలు అభిమానులుపాల్గొని ఘనంగా నిర్వహించారు.

## ఎమ్మెల్యే చంటిబాబు ఆధ్వర్యంలో 13వ వైఎస్ఆర్ వర్ధంతి వేడుకలు



గోకవరం సెప్టెంబర్ 2 ప్రజాపాలన ప్రతినిధి :మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి 13వ వర్ధంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ వర్ధంతి వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు రంప యర్రపాలెం తంటికొండ కొత్తపల్లి గోకవరం గ్రామాల్లో వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జ్యోతుల చంటిబాబు మాట్లాడుతూ వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే చంటిబాబు ఎస్ వి ఆర్ ఫంక్షన్ హాల్ లో పేదలకు దుస్తులు, చీరలు పంచిపెట్టారు. అనంతరం ఆయన స్థానిక ప్రభుత్వాసుపత్రికి వెళ్లి అక్కడ ఉన్న రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు, జడ్పిటిసి దాసరి శ్రీరంగ రమేష్, క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ వరసాల కుమారి ప్రసాద్, జనపరెడ్డి సుబ్బారావు (బాబు) మాజీ జెడ్పటీసీ గుల్లా ఏడుకొండలు, కర్రీ సూర్ర రెడ్డి సుంకర రమణ, ఉనుకూరి అశీరమ్మ యేసు రత్నం, తోలేటి రమ్య శ్రీ ప్రసాద్, నరాల శెట్టి నరసయ్య, దాకారపు ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

## వితంరాజుపల్లి లో ఘనంగా వైస్సార్ 13 వ వర్ధంతి వేడుకలు



వినుకొండ సెప్టెంబర్ 02 (ప్రజాపాలన ప్రతినిధి):వినుకొండ మండలం లో ని వితంరాజుపల్లి గ్రామం లో వైస్సార్ 13 వ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలు అతిధిగా యమ్ పి పి జయశ్రీ వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు. అయన మాట్లాడుతు గ్రామం లో ప్రజలంతా వైస్సార్ కుటుంబానికి ఆదరణ కలిగి ఉంటారని. ఆయన తెచ్చిన ఆరోగ్యశ్రీ ద్వారా గ్రామంలో అనేక మంది లబ్ది పొందరిని. అలాగే ఆయన తరువాత వైస్సార్ తనయుడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ని గ్రామంలో ప్రజలు ఆదరించి అత్యధిక మెజారిటీ ఇచ్చారని రాబోవు ఎన్నికలలో కూడా గ్రామం లో ప్రజలంతా ఆయనకు సహకరిస్తామని.ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానయుడు కి వితంరాజుపల్లి గ్రామం అంటే చాలా ఇష్టంగా ఉంటారని అన్నారు.కార్యక్రమం అనంతరం అన్నదాన కార్యక్రమం ను ఏర్పాటు చేసారు. ఈ వేడుకలలో లో గ్రామ సర్పంచ్ పెనుమాల సుమలత మల్లయ్య,వైస్ సర్పంచ్ సీనియర్ నాయకులు పెద్దిరెడ్డి రామిరెడ్డి,దాల్ మిల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పుల్లారావు, గ్రామ పెద్దలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# అగ్ర దర్శకులిద్దరూ స్ట్రాంగ్ కంబ్యాక్ ఇస్తారా..?

సినీ ఇండస్ట్రీలో ఎవరి కెరీర్ అయినా సక్సెస్ మీదనే ఆధారపడి ఉంటుంది. హిట్లు ఉన్నప్పుడు మోసినవారే.. ఫ్లాప్స్ వచ్చినప్పుడు ట్రోల్ చేస్తుంటారు. ఇక్కడ విజయాలు పరాజయాలు శాశ్వితం కాదు. వరుస హిట్లు కొట్టినవారైనా ఒక్క ఫ్లాప్ తో కిందికి పడిపోతారు. ఫ్లాపుల్లో ఉన్నవారు ఒక సక్సెస్ పడితే పైకి లేస్తుంటారు. ఇప్పుడు ఇదంతా ఎందుకు చెప్పుకోవాల్సి వచ్చిందంటే.. టాలీవుడ్ లో ఇద్దరు అగ్ర దర్శకులకు అర్జెంట్ గా హిట్ కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీరు డైరెక్ట్ చేసిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్స్ గా నిలవడంతో కెరీర్ లో ఎన్నడూ లేని విధంగా నెగెటివిటీని ఫేస్ చేయాల్సి వస్తోంది. వాళ్ళెవరో కాదు కొరటాల శివ మరియు పూరీ జగన్నాథ్. గతేడాది వరకూ తెలుగు చిత్ర పరిశ్రమలో అపజయం ఎరుగని దర్శకుడిగా కొనసాగారు కొరటాల శివ. కమర్షియల్ కంటెంట్ కు తనదైన శైలిలో సందేశాన్ని జోడిస్తూ వరుస హిట్లు అందుకున్నాడు. ఇలాంటి డైరెక్టర్ మెగా తండ్రీకొడుకులు చిరంజీవి మరియు రామ్ చరణ్ ప్రధాన పాత్రల్లో "ఆచార్య" చిత్రాన్ని



తెరకెక్కించడంతో అందరిలో భారీ హైప్ క్రియేట్ అయింది. అయితే భారీ అంచనాల మధ్య వచ్చిన 'ఆచార్య' సినిమా ఘోర పరాజయాన్ని చవిచూసింది. పేలవమైన కంటెంట్ తో బలహీనమైన క్యారక్టరైజేషన్ తో ప్రేక్షకులను ఈ సినిమా తీవ్రంగా నిరాశ పరిచింది. మినిమమ్ ఓపెనింగ్స్ కూడా రాబట్టక పోయింది. ఫలితంగా ఆల్ టైం డిజాస్టర్స్ లో ఒకటిగా నిలిచి పోయింది. 150కి పైగా సినిమాలు చేసిన చిరంజీవి కెరీర్ లోనే బిగ్గెస్ట్ ఫ్లాప్ అనిపించుకుంది. దీని దెబ్బకు కొరటాల ఎప్పుడూ లేనంత ట్రోల్స్ ఎదుర్కొన్నాడు. మరోవైపు డేరింగ్ అండ్ డాషింగ్ డైరెక్టర్ గా పిలవబడే పూరీ జగన్నాథ్ "లైగర్" సినిమాతో డిజాస్టర్ అందుకున్నాడు. పూరి రైటింగ్ – డైలాగ్స్ – మేకింగ్ కు స్పెషల్ ఫ్యాన్ బేస్ ఉంటుంది. ఇలానే ఎన్నో బ్లాక్ బస్టర్స్ సాధించాడు. ప్రతీ హీరో కూడా ఒక్క సినిమా అయినా కలిసి వర్క్ చేయాలని కోరుకునే దర్శకుడాయన. అయితే గత కొన్నేళ్లుగా తన రేంజ్ కు తగ్గ సినిమాలు చేయని పూరీ.. 'ఇస్మార్ట్ శంకర్' మూవీతో మళ్లీ సక్సెస్ ట్రాక్ ఎక్కాడు. ఈ క్రమంలో విజయ్ దేవర కొండ హీరోగా 'లైగర్' అనే స్పోర్ట్స్ యాక్షన్ సినిమా అనౌన్స్ చేయడంతో అందరిలో అంచనాలు రెట్టింపు అయ్యాయి. అందులోనూ ఇది పాన్ ఇండియా ప్రాజెక్ట్ కావడం.. ఇండియా మొత్తం షేక్ అవుతుందని చెప్పడంతో అందరూ నమ్మారు. కానీ ఈ సినిమా ప్రేక్షకులను పూర్తిగా నిరాశ పరిచింది. అసలు ఇది పూరీ జగన్నాథ్ సినిమానేనా అని సందేహించే విధంగా 'లైగర్' సినిమా ఉంది. భారీ బడ్జెట్ తో రూపొందించిన ఈ చిత్రానికి అదే స్థాయిలో నష్టాలు వస్తున్నాయి. సినిమాకు పెట్టిన పెట్టుబడి.. ఇప్పటి వరకూ వచ్చిన వసూళ్లను పోల్చి చూస్తే ఆల్ టైం డిజాస్టర్స్ లిస్టులో జాయిన్ అవడం గ్యారెంటీ అని చెప్పవచ్చుఇలా టాలీవుడ్ స్టార్స్ డైరెక్టర్లు కొరటాల శివ పూరీ జగన్నాథ్ ఇద్దరూ రెండు భారీ డిజాస్టర్స్ తో డిజప్పాయింట్ చేశారు. అయితే వీరిద్దరూ స్ట్రాంగ్ కంబ్యాక్ ఇవ్వాలని అభిమానులు కోరుకుంటున్నారు. 'జనగణమన' సినిమాతో పూరీ.. ప్రాజెక్ట్ తో కొరటాల సాలిడ్ హిట్స్ సాధిస్తారని భావిస్తున్నారు. ఇప్పుడు ట్రోల్ చేసిన వారితోనే ప్రశంసలు అందుకుంటారని అంటున్నారు. మరి రానున్న రోజుల్లో ఏం జరుగుతుందో వేచి చూద్దాం.

## మహేష్ ఫ్యాన్స్ ఆశించే బ్లాక్ బస్టర్స్ వస్తాయా..?



సూపర్ స్టార్ మహేష్ బాబు గత కొన్నేళ్లుగా వరుస విజయాలతో దూసుకుపోతున్నారు. 'భరత్ అనే నేను' 'మహర్షి' 'సరిలేరు నీకెవ్వరు' వంటి సినిమాలు బాక్సాఫీస్ వద్ద సక్సెస్ అందుకున్నాయి. ఇటీవల వచ్చిన 'సర్కారు వారి పాట' చిత్రం కూడా హిట్ గానే పరిగణించబడుతోంది. బ్యాక్ టూ బ్యాక్ హిట్స్ వస్తున్నాయి కానీ.. ఈ విజయాల పట్ల సూపర్ స్టార్ ఫ్యాన్స్ మాత్రం హ్యాపీగా లేరని తెలుస్తోంది. ఎందుకంటే ఇవన్నీ మహేష్ బాబు రేంజ్ హిట్లు కాదనేది వారు అభిప్రాయ పడుతున్నారు. ఈసారి బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ అందుకొని.. తన స్టామినా ఏంటో బాక్సాఫీస్ కు చూపించాలని కోరుకుంటున్నారు. మహేష్ గత కొంతకాలంగా ఒకే తరహా సినిమాలు చేస్తూ.. సబ్టిల్ రోల్స్ కే పరిమితం అవుతూ వస్తున్నారు. 'సర్కారు వారి పాట' తో ట్రాక్ మారుస్తారని అందరిలో భావించారు. అయితే అది కూడా అభిమానులను నిరుత్సాహ పరిచింది. మహేశ్ సరికొత్త లుక్ లో కనిపించాడు కానీ.. ఈ సినిమా కంటెంట్ పరంగా పూర్తి స్థాయిలో మెప్పించలేకపోయింది. మహేష్ కాకుండా ఇంకో హీరో ఎవరు చేసినా ఈ సినిమాలు ఫ్లాప్ అయ్యేవని ఫ్యాన్స్ నుంచి కామెంట్స్ వస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రాబోయే త్రివిక్రమ్ శ్రీనివాస్ మరియు ఎస్ఎస్ రాజమౌళి చిత్రాలతో మహేష్ బాబు సాలిడ్ హిట్స్ అందుకోవాల్సిన అవసరం ఉంది. 'అతడు' 'ఖలేజా' వంటి చిత్రాల తర్వాత మహేష్ – త్రివిక్రమ్ కాంబినేషన్ లో ఎస్ఎస్ఎంబి 28 మూవీ తెరకెక్కనున్న విషయం తెలిసిందే. దాదాపు పుష్కర కాలం తర్వాత వీరి కలయికలో రాబోతున్న ఈ సినిమాపై అభిమానులుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ వారంలోనే ఈ ప్రాజెక్ట్ సెట్స్ మీదకు వెళ్లనుంది. ఎస్ఎస్ఎంబి 28 అనేది త్రివిక్రమ్ ట్రేడ్ మార్క్ ఫ్యామిలీ డ్రామాతో కూడిన అవుట్ అండ్ అవుట్ యాక్షన్ ఎంటర్టైనర్ అని తెలుస్తోంది. ఇది కచ్చితంగా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే పక్కా కమర్షియల్ సినిమా అని అంటున్నారు. దీంతో ఇటు క్లాస్ అటు మాస్ ఆడియన్స్ ని టార్గెట్ చేయబోతున్నారు. ఇందులో మహేష్ న్యూ లుక్ లో కనిపించబోతున్నారు. 2023 సమ్మర్ లో ఈ సినిమా రిలీజ్ అవుతుంది. ఇదే క్రమంలో మహేష్ బాబు చేయనున్నఎస్ఎస్ఎంబి 29 పైనా సూపర్ ఫ్యాన్స్ భారీ అంచనాలు పెట్టుకున్నారు. దర్శక ధీరుడు రాజమౌళి తెరకెక్కించే ఈ సినిమాతో ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తారని భావిస్తున్నారు. ఇప్పటి వరకు తెలుగులోనే సినిమాలు చేస్తూ వచ్చిన మహేశ్.. ఈసారి పాన్ ఇండియా మార్కెట్ ని టార్గెట్ చేయనున్నారు. మహేష్ – జక్కన్న సినిమా ఆఫ్రికన్ ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్ లో అడ్వెంచరస్ యాక్షన్ థ్రిల్లర్ గా ఉంటుందని ప్రచారం జరుగుతుంది. బాహుబలి రచయిత విజయేంద్ర ప్రసాద్ ఇదే హింట్ ఇచ్చారు. ఇందులో మహేశ్ ని కొత్తగా ప్రెజెంట్ చేయడానికి ఆస్కారం వుంటుంది. వచ్చే ఏడాది ఈ భారీ ప్రాజెక్ట్ సెట్స్ మీదకు వెళ్లనుంది. ఇలా మహేష్ నుంచి రాబోయే రెండు సినిమాలు కూడా క్రేజీ ప్రాజెక్ట్స్ అనే చెప్పాలి. ఇవి తప్పకుండా ఫ్యాన్స్ కోరుకునే సినిమాలు అవుతాయని.. బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్స్ అవుతాయని అభిమానులు భావిస్తున్నారు. ముందుగా త్రివిక్రమ్ సినిమాతో బిగ్ హిట్ కొడితే.. ఇది తదుపరి రాజమౌళి ప్రాజెక్ట్ కి చాలా ప్లస్ అవుతుంది. మరి రాబోయే రోజుల్లో ఏం జరుగుతుందో చూడాలి.

## మరిన్ని 'ది కశ్మీర్ ఫైల్స్'ని తెరపైకి తెస్తారట!

అభిషేక్ అగర్వాల్ అర్ట్స్ అధినేత అభిషేక్ అగర్వాల్ తొలి సారి దర్శకుడు వివేక్ రంజన్ అగ్నిహోత్రితో కలిసి నిర్మించిన సంచలన మూవీ 'ది కశ్మీర్ ఫైల్స్'. కొన్నేళ్ల క్రితం కశ్మీర్ పండిట్లపై జరిగిన అవమానవీయ మారహోమం నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా దేశ వ్యాప్తంగా సంచలనాలు సృష్టించింది. ఇండియన్ బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి వసూళ్లని రాబట్టింది. చిన్న సినిమాగా విడుదలై భారీ బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచింది. ఈ మూవీతో టాలీవుడ్ ప్రొడ్యూసర్ అభిషేక్ అగర్వాల్ బాలీవుడ్ కు పరిచయమైన విషయం తెలిసిందే. తొలి చిత్రంతో సంచలనం సృష్టించడమే కాకుండా భారీ బ్లాక్ బస్టర్ ని దక్కించుకుని వార్తల్లో నిలిచారు. రీసెంట్ గా పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి 'కార్తికేయ 2' వంటి మరో బ్లాక్ బస్టర్ హిట్ ని సొంతం చేసుకున్న అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ అధినేత అభిషేక్ అగర్వాల్ అయామ్ బుద్ధ ప్రొడక్షన్స్ తో కలిసి 'ది కశ్మీర్ ఫైల్స్' తరహాలో దేశ వ్యాప్తంగా వున్న అన్ టోల్డ్ స్టోరీస్ ని తెరపైకి తీసుకురాబోతున్నారు. ఇందు కోసం ఈ రెండు నిర్మాణ సంస్థలు కలిసి ముందకెళ్లాలని వినాయక చవిత సందర్భంగా చేతలు కలిపారు. ఇందు కోసం ప్రత్యేకంగా ఒప్పందాన్ని కుదుర్చుకుని అగ్రిమెంట్ కు సంబంధించిన డాక్యుమెంట్లపై సంతకాలు చేశారు. అభిషేక్ అగర్వాల్ తండ్రి తేజ్ నారాయణ్ సమక్షంలో ఇరు సంస్థలకు సంబంధించిన అభిషేక్ అగర్వాల్ పల్లవి జోషీ అగ్రిమెంట్ లు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా తాజా ఒప్పందానికి సంబంధించి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.





## స్పెషల్ ఫోటోతో పవన్ కి చిరు సూపర్బ్ విషెస్.!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ బర్త్ డే కావడంతో సోషల్ మీడియాలో అలా భారీ హంగామా నడుస్తుంది. దీనితో పాటుగా బయట కూడా పవన్ కి భారీ ఎత్తున సంబరాలతో వేడుకలు జరుగుతున్నాయి. ఇక ఇదిలా ఉండగా ఆల్రెడీ అనేక మంది సినీ ప్రముఖులు రాజకీయ ప్రముఖులు పవన్ కళ్యాణ్ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తుండగా అందరికన్నా బెస్ట్ విషెష్ పవన్ సోదరుడు మెగాస్టార్ చిరంజీవి నుంచి వచ్చాయి. "తన ఆశ, ఆశయం ఎల్లప్పుడూ జనహితమే. తాను నమ్మిన సిద్ధాంతం కోసం ఎప్పుడూ నిజాయితీతో, చిత్తశుద్ధితో శ్రమించే పవన్ కళ్యాణ్ ఆశయాలన్నీ నెరవేరాలని కోరుకుంటూ, ఆశీర్వదిస్తూ, కళ్యాణ్ బాబుకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను." అంటూ పవన్ మరియు తనపై ఓ ఇంట్రెస్టింగ్ ఫోటో తమ యంగ్ ఏజ్ లో ఉన్నదాన్ని షేర్ చేసి అందరికీ చిన్న ట్రీట్ ఇచ్చారు. దీనితో ఈ స్పెషల్ ఫోటో చూసి అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## ఓటిటి యాప్ లో కూడా "విక్రమ్" స్ట్రీమింగ్.!




లోక నాయకుడు కమల్ హాసన్ హీరోగా మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి విలన్ గా స్టార్ హీరో సూర్య కీలక పాత్రలో నటించిన లేటెస్ట్ సాలిడ్ యాక్షన్ ఎంటర్టైనర్ కం క్రేజీ మల్టీ స్టారర్ చిత్రం "విక్రమ్". దర్శకుడు లోకేష్ కనగ్ రాజ్ తెరకెక్కించిన ఈ చిత్రం విడుదల అయ్యిన అన్ని చోట్ల కూడా బ్లాస్టింగ్ హిట్ అయ్యి రికార్డు వసూళ్లు కొల్లగొట్టి భారీ లాభాలను తెచ్చి పెట్టింది. మరి థియేటర్స్ లో అయ్యాక ఈ చిత్రం రిలీజ్ ఓటిటి లో వరుస పెట్టి వస్తుంది. మొదటగా డిస్నీం హాట్ స్టార్ లో అందుబాటులోకి వచ్చిన ఈ చిత్రం తర్వాత మన తెలుగు యాప్ ఆహా లో స్ట్రీమింగ్ కి వచ్చింది. అయితే మరో స్ట్రీమింగ్ యాప్ లో కూడా రానున్నట్టు ఫిక్స్ అయ్యింది. ఈసారి ప్రముఖ యాప్ జీ 5 లో ఈ సినిమా స్ట్రీమింగ్ కి రానుందట. మరి ఇందులో కూడా అన్ని భాషల్లోనూ స్ట్రీమింగ్ కి అందుబాటులో ఉన్నట్టు వారు తెలిపారు. మరి ఆ సబ్ స్క్రైబర్స్ అయితే ఈ సినిమాని ఇప్పుడు నుంచి వీక్షించవచ్చు.

## రికార్డు మొత్తం షోలతో "జల్సా" అదిరే రికార్డు.!




టాలీవుడ్ మాస్ గాడ్ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా ఇలియానా హీరోయిన్ గా దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో వచ్చిన సినిమా "జల్సా". మరి ఈరోజు పవన్ బర్త్ డే కానుకగా అభిమానులు ఈ సినిమా రీ రిలీజ్ ని కొత్త ప్రింట్ తో ప్లాన్ చేసుకోగా ప్రపంచం వ్యాప్తంగా భారీ రెస్పాన్స్ ఈ షోల షో కనిపించింది. అయితే ఈ సినిమా ఇది వరకే రికార్డు మొత్తంలో 500 షో లకి పైగా నమోదు అయ్యి ఆల్ టైం రికార్డు సెట్ చెయ్యగా ఇప్పుడు ఫైనల్ కౌంట్ గా 701 షోస్ తో అత్యధిక షో లు ప్రదర్శింపబడిన సినిమాగా రికార్డు సెట్ చేసినట్టుగా ఇప్పుడు తెలుస్తుంది. మొత్తానికి అయితే జల్సా సంబరాలు నెక్స్ట్ లెవెల్లోనే ఉన్నాయని చెప్పాలి. ఇక ఈ సినిమాకి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించగా గీత ఆర్ట్స్ వారు నిర్మాణం వహించారు.






Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India.
Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com